విలేఖరులు
కావలెను
రాష్ట్ర వ్యాప్తముగా అన్ని జిల్లా లకు బ్యూరోలు, స్టాఫ్ రిపోర్టర్ లు, నియోజకవర్గ స్థాయి ఇంచార్జ్ లు, మండలముల వారిగా రిపోర్టర్ లు కావలెను.
(అనుభవము కలవారికి ప్రాధాన్యత కలదు)
పూర్తి వివరములకు : 6281086394
సంప్రదించగలరు ఎడిటర్ చల్లా శ్రీకాంత్

రాయల్ జర్నలిజం
ద్విభాషా దినపత్రిక
ROYAL JOURNALISM
RNI : APBIL/2023/86665

గుంటూరు | సంపుటి : 01 | సంచిక : 256 | చీఫ్-ఎడిటర్ : చల్లా శ్రీనివాసరావు | ఆదివారం 20 అక్టోబర్ 2024 | పేజీలు : 8 | వెల :రూ 2-00

GUNTUR | VOL-01 | ISSUE - 256 | CHIEF EDITOR : CHALLA SRINIVASA RAO | 20 SUNDAY SEPTEMBER 2024 | PAGES : 8 | Rs :2-00

# విశాఖను ఆర్థిక రాజధానిగా చేస్తాం: ఏపీ సీఎం చంద్రబాబు



అమరావతి: అమరావతిలో రాజధాని నిర్మాణ పనులను సీఎం చంద్రబాబు పునఃప్రారంభించారు. సీఆర్‌డీఏ ఆఫీసు పనులను ప్రారంభించి ఈ కార్యక్రమాన్ని మొదలుపెట్టారు. తుళ్లూరు మండలం ఉద్దండరాయుని పాలెం వద్ద పనులు ప్రారంభించారు. భవన ప్రాంగణంలో సీఎం చంద్రబాబు, మంత్రి నారాయణ పూజా కార్యక్రమం నిర్వహించారు. రూ.160 కోట్లతో గతంలో తెదేపా హయాంలో ఏడంతస్తుల్లో సీఆర్‌డీఏ కార్యాలయ పనులు చేపట్టారు. ప్రాజెక్టు కార్యాలయ నిర్మాణాన్ని 2017లో ప్రారంభించారు. వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ పనులను నిలిపేశారు. మొత్తం 3.62 ఎకరాల్లో జీ ప్లస్ 7 భవనాన్ని ఇక్కడ ప్రభుత్వం నిర్మిస్తోంది. అదనంగా పార్కింగ్, ల్యాండ్ స్కేపింగ్‌కు 2.51 ఎకరాల విస్తీర్ణం కేటాయించారు. ఆర్కిటెక్చరల్ ఫినిషింగ్స్, ఇంటీరియర్స్, ఎలక్ట్రిక్ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చంద్రబాబు మాట్లాడారు. "చరిత్రను తిరగరాసేందుకు మనమంతా ఇక్కడ సమావేశమయ్యాం. రాష్ట్ర విభజన సమయంలో అనేక ఇబ్బందులు పడ్డాం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సైబరాబాద్ నగరాన్ని తీర్చిదిద్దిన ఘనత మాదే. ముందుచూపుతో ఆనాడే సైబరాబాద్‌లో 8 వరుసల రోడ్లు వేశాం. శంషాబాద్ విమానాశ్రయానికి 5 వేల ఎకరాలు ఎందుకని అందరూ ప్రశ్నించారు. అభివృద్ధికి అడ్డుపడే వారు ప్రతిచోటా ఉంటారు. అమరావతి రైతులను ఒప్పించి భూమి సేకరించాం. రాజధాని, సమాజ హితం కోసం మీరంతా భూములు ఇచ్చారు. అమరావతి కోసం 54 వేల ఎకరాలు సేకరించాం. మహిళా రైతులు వైకాపా ప్రభుత్వంపై గట్టిగా పోరాడారు""రాష్ట్రానికి మధ్యలో ఉండే ప్రాంతం.. అమరావతి. ఒక రాష్ట్రం, ఒక రాజధాని అని.. ప్రతిచోటా చెప్పాను. విశాఖను ఆర్థిక రాజధానిగా చేస్తాం. కర్నూలులో హైకోర్టు బెంచ్, పరిశ్రమలను ఏర్పాటు చేస్తాం" అని చంద్రబాబు వెల్లడించారు.

**బుల్లెట్ రైలు ఇవ్వాలని కేంద్రాన్ని కోరా..**

"అమరావతికి విట్, ఎస్ఆర్ఎం, అమృత్ వర్సిటీలు వస్తున్నాయి. దేశంలోని టాప్ 10 విద్యాసంస్థల బ్రాంచ్‌లు ఇక్కడికి రావాలి. బుల్లెట్ రైలు ఇవ్వాలని కేంద్రాన్ని కోరా. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, అమరావతి మీదుగా బుల్లెట్ రైలు కావాలి. అమరావతి నిర్మాణానికి రుణం ఇచ్చేందుకు ప్రపంచబ్యాంకు అంగీకరించింది. అమరావతిలో నిర్మాణ పనులు జెట్ స్పీడ్‌తో జరగాలి" అని చంద్రబాబు అన్నారు.

# జమ్మూకశ్మీర్‌కు రాష్ట్రహోదాపై క్యాబినెట్ తీర్మానం.. ఎల్జీ ఆమోదం



శ్రీనగర్: జమ్మూ కశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలని కేంద్రాన్ని కోరుతూ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా మంత్రివర్గం చేసిన తీర్మానాన్ని లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ఆమోదించారు. ఈ అంశాన్ని ప్రధానితో పాటు కేంద్రం దృష్టికి తీసుకెళ్లేందుకు క్యాబినెట్ సమావేశంలో ఓ అంగీకారానికి వచ్చారు. రాష్ట్ర హోదా పునరుద్ధరణకు సంబంధించిన విషయాలపై ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులతో సమావేశమయ్యేందుకు ముఖ్యమంత్రి త్వరలో దిల్లీ వెళ్లనున్నట్లుగా అధికారులు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. మొదటి శాసనసభా సమావేశం నవంబర్ 4న జరగనున్నట్లుగా క్యాబినెట్ పేర్కొంది. కొత్తగా ఎన్నికైన అసెంబ్లీ సభ్యులతో ప్రమాణం చేయించేందుకు ముబారిక్ గుల్‌ను ప్రొటెం స్పీకర్‌గా నియమించాలని సిఫార్సు చేసింది. శాశ్వత స్పీకర్ ఎన్నికయ్యే వరకూ గుల్‌ను ప్రొటెం (మిగతా 5వ పేజీలో)

# కడప జిల్లాలో దారుణం.. ఇంటర్ విద్యార్థినిపై పెట్రోల్ దాడి



బద్వేల్: కడప జిల్లా బద్వేలు సమీపంలోని సెంచరీ ప్లైవుడ్ వద్ద ఇంటర్ విద్యార్థినిపై పెట్రోల్ దాడి ఘటన కలకలం రేపింది. విద్యార్థినిని రోడ్డు పక్కనే చెట్లలోకి తీసుకెళ్లి విఘ్నేశ్ అనే యువకుడు పెట్రోల్ పోసి నిప్పంటించాడు. తీవ్రంగా గాయపడిన విద్యార్థినిని స్థానికులు కడప రిమ్స్‌కు తరలించారు. ఘటనపై బద్వేలు గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రేమ పేరుతో 8వ తరగతి నుంచే విఘ్నేశ్ .. తమకు కుమార్తెను వేధిస్తున్నాడని బాధితు రాలి తల్లిదండ్రులు ఆరోపించారు. అతనికి వివాహమైనా వేధింపులు ఆపలేదని, ఇవాళ పెట్రోల్ పోసి నిప్పంటించాడని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కడప రిమ్స్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థిని నుంచి జిల్లా జడ్జి వాంగ్మూలం నమోదు చేసుకున్నారు.

**నిందితుడి కోసం నాలుగు బృందాలతో గాలింపు: ఎస్పీ**

"గాయపడిన ఇంటర్ విద్యార్థినికి కడప రిమ్స్‌లో చికిత్స కొనసాగుతోంది. 80శాతం గాయాలయ్యాయి. చిన్నప్పటి నుంచి ఇద్దరికీ పరిచయం ఉంది. ఇద్దరూ బద్వేలు రామాంజనేయనగర్‌కు చెందినవారే. తనను కలవాలని విద్యార్థినికి విఘ్నేశ్ ఫోన్ చేశాడు. కలవకపోతే చనిపోతానని ఆమెను బెదిరించాడు. ఇద్దరూ పీపీకుంట చెక్‌పోస్టు సమీపంలోని ముళ్ల పొదల్లోకి వెళ్లారు. విద్యార్థినిపై పెట్రోల్ పోసి నిప్పంటించి విఘ్నేశ్ పరారయ్యాడు. నిందితుడి ఆచూకీ కోసం నాలుగు బృందాలతో గాలింపు చేపట్టాం" అని కడప ఎస్పీ హర్షవర్ధన్ తెలిపారు.

**నిందితుడిని అరెస్టు చేయండి: చంద్రబాబు**

ఇంటర్ విద్యార్థినిపై పెట్రోల్ దాడి ఘటనపై సీఎం చంద్రబాబు అధికారులతో మాట్లాడారు. ఆమె ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని, నిందితుడిని వెంటనే అరెస్టు చేయాలని అధికారులను ఆదేశించారు.

# మహారాష్ట్ర ఎన్నికలు దేశ రాజకీయాలను మార్చగలవు: అఖిలేష్ యాదవ్



ముంబయి: మహారాష్ట్రలో నవంబర్ 20న పోలింగ్ జరగనున్న నేపథ్యంలో ప్రతిపక్ష 'మహా వికాస్ అఘాడీ' సీట్ల పంపకంలో భాగంగా సమాజ్‌వాదీ పార్టీకి 12 స్థానాలు ఇవ్వాలని కోరినట్లుగా సమాజ్ వాదీ పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్ పేర్కొన్నారు. తమ పార్టీకి బలమున్న కొన్ని స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించామని తెలిపారు. మహారాష్ట్రలోని ధూలే నియోజకవర్గం నుంచి పార్టీ అభ్యర్థిగా ఇర్షాద్ జహాగీర్దార్‌ను ప్రకటిస్తున్నట్లుగా ఆయన పేర్కొన్నారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు రాష్ట్ర భవిష్యత్తును మాత్రమే కాకుండా దేశ భవిష్యత్తును కూడా నిర్ణయిస్తాయని ఆయన అన్నారు. ధూలే నగరంలో ఏర్పాటు చేసిన ఎన్నికల ర్యాలీలో ఆయన ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తూ భాజపాపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. భారతీయ జనతా పార్టీ రాష్ట్రంలో పార్టీలను విభజించి.. అధికారాన్ని దొంగిలించిందని అఖిలేష్ దుయ్యబట్టారు. అసెంబ్లీకి విద్యావంతులైన ఎమ్మెల్యేలను పంపడం ప్రజల బాధ్యత అని పేర్కొన్నారు. "మహారాష్ట్ర ఎన్నికలు దేశ రాజకీయాలను మార్చగలవు. ఇవి చారిత్రకమైనవి. ఎన్నికల ఫలితాల తర్వాత రాష్ట్రంలో భాజపా ప్రభుత్వం ఉండదు. దీంతో దిల్లీలోని కేంద్ర ప్రభుత్వం కూడా కూలిపోతుంది. అన్ని విషయాలకు బుల్డోజర్‌లను పంపే ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ మళ్లీ అధికారంలోకి వచ్చే అవకాశం లేదు" అని అఖిలేష్ జోస్యం చెప్పారు .రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో భాజపాను, దాని మిత్రపక్షాలను ఓడించి.. తగిన గుణపాఠం చెప్పాలని ప్రజలను కోరారు. రాష్ట్రంలోని మహాయుతి ప్రభుత్వం ఇక్కడి పరిశ్రమలను గుజరాత్‌కు తరలిస్తోందని ఆయన ఆరోపించారు. షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం ఇటీవల ప్రకటించింది. రాష్ట్రంలో ఒకే దశలో నవంబర్ 20న పోలింగ్ జరగనుండగా నవంబర్ 23న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నట్లు కేంద్ర ఎన్నికల కమిషన్ వెల్లడించింది. అయితే శివసేన, ఎన్సీపీ చీలిక తర్వాత జరుగుతున్న తొలి అసెంబ్లీ ఎన్నికలు కావడం తో దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. అసలైన శివసేన, ఎన్సీపీ ఏవో ప్రజలు తేల్చనున్నారు.

# 2027లోనే జమిలీ ఎన్నికలు..

## కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్..?



న్యూఢిల్లీ : భారతదేశం మొత్తం ఒకేసారి 2027 ఫిబ్రవరిలో ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో ఎన్నికలు (జమిలీ) నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. జమిలీ ఎన్నికలకు మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ గారి ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేశారు. కమిటీ కూడా పూర్తి స్థాయిలో పరిశీలన జరిపి తన నివేదికను కేంద్ర ప్రభుత్వంకు అందజేసింది. జమిలి ఎన్నికలు జరగాలి అంటే రాజ్యాంగంలో 5 ఆర్టికల్స్(ఆర్టికల్ 83,85,172,174,356) లు రాజ్యాంగ సవరణ బిల్లు ద్వారా చేయాలని సూచించింది. ఈ బిల్లు ఆమోదం పొందాలంటే లోక్ సభ,రాజ్య సభ లో 67% మంది సపోర్ట్ చెయ్యాలి ,14 రాష్ట్ర అసెంబ్లీలు మద్దతి ఇవ్వాల్సి ఉంటుంది. అలా మద్దతు ఇస్తే బిల్లు ఆమోదం పొంది జమిలి ఎన్నికలు సాధ్యం అవుతాయి. ఈ బిల్లు 2024 ఈ శీతాకాల సమావేశాల్లోనే పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టనుంది. ఈ బిల్లుకు పార్లమెంట్ లో మద్దతు లభిస్తే 2027 ఫిబ్రవరిలో ఉత్తర ప్రదేశ్ ఎన్నికలతో పాటు దేశం మొత్తం అసెంబ్లీ,పార్లమెంట్ ఎన్నికలు నిర్వహిస్తుంది. ఈ ఎన్నికలు జరిగిన 100 రోజుల తర్వాత మున్సిపల్,గ్రామ పంచాయితి ఎన్నికలు నిర్వహిస్తుంది. దేశం మొత్తం పరిపాలన సౌలభ్యం కొరకు ఈ జమిలి ఎన్నికలు జరపనున్నట్లు కేంద్ర మంత్రి ప్రహ్లాద ఘోషి తెలిపారు. అయితే ఏపీ, ఒడిస్సా వంటి రాష్ట్రాల్లోని ప్రభుత్వాలు 2029 వరకు పాలించే హక్కు ఉంది. రెండేళ్ల పరిపాలనను రద్దు చేసుకుని ఎన్నికలు వెళ్తాయా అన్నది ఇక్కడ అసలు ప్రశ్న. మెజార్టీ రాష్ట్రాల్లో బీజేపీ కూటమి అధికారంలో ఉండటం, అటు ప్రధాన ప్రతిపక్షం అయిన కాంగ్రెస్ పార్టీ సైతం జమిలి ఎన్నికలకు సై అనడంతో , దేశం మొత్తం ఒకేసారి ఎన్నికలు సాధ్యం అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. అన్నీ అనుకున్నట్టు జరిగితే 2027లోనే జమిలి ఎన్నికలు నిర్వహించడానికి కేంద్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది.

# లిక్కర్, ఇసుక స్కాంలో నిండా మునిగారు: జగన్ ఫైర్



అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సారథ్యంలో రాష్ట్రంలో అధికారంలో ఉన్న తెలుగుదేశం- జనసేన- భారతీయ జనతా పార్టీ సంకీర్ణ కూటమి ప్రభుత్వంపై వైఎస్ఆర్సీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఘాటు విమర్శలు చేశారు. విజయనగరం జిల్లా గుర్ల మండలంలో అతిసార ప్రబలిన ఘటనలో 11 మంది మరణించడం పట్ల ఆయన దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. చంద్రబాబు ప్రభుత్వ హాయంలో ప్రజారోగ్య వ్యవస్థ కుప్పకూలిపోయిందని ఆరోపించారు. దీనికి ప్రత్యక్ష ఉదాహరణ- విజయనగరం జిల్లాలో సంభవించిన అతిసార మరణాలేనని అన్నారు. 11 మంది మరణించినా, వందల సంఖ్యలో బాధితులు ఉన్నా చంద్రబాబు ప్రభుత్వం నిద్ర వీడట్లేదంటూ జగన్ మండిపడ్డారు. గుర్ల మండలానికి సమీపంలోనే విజయనగరం, విశాఖపట్నంల్లో మంచి ఆసుపత్రులు ఉన్నప్పటికీ స్థానిక పాఠశాలలో బెంచీల మీద అతిసారా బాధితులకు చికిత్స అందించడం దారుణమని ధ్వజమెత్తారు. నాణ్యమైన అత్యవసర వైద్యాన్ని అందించడంలో ప్రభుత్వం విఫలమైందని, లిక్కర్, ఇసుక స్కాంలల్లో నిండా మునిగిపోయిన ప్రభుత్వ పెద్దలు ప్రజల కష్టాలను గాలికి వదిలేశారంటూ జగన్ విమర్శించారు. ఇప్పటికే 104, 108 వ్యవస్థలు దెబ్బతిన్నాయని, చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తరువాత సిబ్బందికి సరిగ్గా జీతాలు కూడా అందట్లేదని పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీ నిర్వీర్యం అయిపోయిందని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు 1,800 కోట్ల రూపాయల బకాయిలు గత మార్చి నుంచి పెండింగ్‌లో పెట్టారని అన్నారు. ఆరోగ్య ఆసరాను పూర్తిగా ఎత్తివేశారని, జీరో వేకెన్సీ పాలసీకి మంగళం పాడారని విమర్శించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో స్పెషలిస్టు డాక్టర్లను తీసివేశారని, విలేజ్ క్లినిక్స్, పీహెచ్‌సీలను నాశనం చేశారని అన్నారు. చంద్రబాబు పాలనలో ఫ్యామిలీ డాక్టర్ ఊసే లేకుండా పోయిందని జగన్ ఆరోపించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాడు-నేడు పనులు నిలిచిపోయాయని, కొత్త మెడికల్ కాలేజీలను అస్తవ్యస్తం చేశారని, కుంభకోణాలకు పాల్పడుతూ వాటిని అమ్మడానికి ప్రభుత్వ పెద్దలు సిద్ధమౌతున్నారని చెప్పారు. కొత్త మెడికల్ కాలేజీలను తన వారికి కట్టబెట్టడానికి చంద్రబాబు వాటిని ప్రైవేటుపరం చేస్తోన్నారని చెప్పారు. ఈ ప్రభుత్వం చేస్తున్న తప్పులు ప్రజల ప్రాణాల మీదకు వస్తోన్నాయని అన్నారు. ఇప్పటికైనా తక్షణ చర్యలు తీసుకోవాలని, డయేరియా బాధిత గ్రామాల్లో నాణ్యమైన వైద్యం, మంచినీటి వనరులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జగన్ డిమాండ్ చేశారు.

# 4 నెలల సమయం ఇవ్వండి..: జూడాలతో బెంగాల్ సీఎం



కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లోని ఆర్‌జీ కర్ ప్రభుత్వ ఆసుపత్రి ఘటనలో న్యాయం చేకూర్చాలని, తమ డిమాండ్లు నెరవేర్చాలని జూనియర్ వైద్యులు చేపట్టిన నిరవధిక నిరాహార దీక్ష కొనసాగుతోంది. కాగా ఈ విషయంపై బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్పందిస్తూ జూనియర్ వైద్యులు దీక్షను వీడాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి ఒక్కరికీ నిరసన తెలిపే హక్కు ఉందని, అయితే.. వైద్యారోగ్య సేవలపై దాని ప్రభావం పడకూడదని ఆమె వ్యాఖ్యానించారు. వైద్యులు తమ ముందుకు తెచ్చిన డిమాండ్లను ఇప్పటికే నెరవేర్చామని, మిగతా వాటి కోసం 3-4 నెలల సమయం ఇవ్వాలని మమత వైద్యులను కోరారు. ఈ విషయంపై చర్చలకు రావాలని మరోసారి జూనియర్ వైద్యులకు పిలుపునిచ్చారు. జూనియర్ డాక్టర్లు సోమవారం ప్రభుత్వంతో చర్చలు జరిపేందుకు రావాలని మమత మరోసారి ఆహ్వానించారు. ఆర్జీకర్ ఆసుపత్రి వద్ద నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న జూనియర్ వైద్యుల వేదిక వద్దకు శనివారం చీఫ్ సెక్రటరీ మనోజ్ పంత్ వెళ్లారు. ఈ సమయంలో సీఎం వైద్యులతో ఫోన్‌లో మాట్లాడారు. వైద్యులు చేసిన పలు డిమాండ్లను నెరవేర్చడానికి విధానపరమైన నిర్ణ యాలు తీసుకోవాల్సిన అవసరం ఉంటుందని ఆమె పేర్కొ న్నారు. ఏం చేయాలి? ఏం చేయకూడదు? అనే విషయా లను ప్రభుత్వానికి వైద్యులు నిర్దేశించడం సరికాదని వ్యాఖ్యాని ంచారు. వైద్యుల డిమాండ్లపై చర్చించిన అనంతరం నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. కోల్‌కతాలోని ఆర్జీకర్ ప్రభుత్వ కళాశాల ఆసుపత్రిలో ఆగస్టు 9న జూనియర్ వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన విష యం తెలిసిందే. బాధితురాలి కుటుంబానికి న్యాయం చేయాలని వైద్య విద్యార్థులు పెద్దఎత్తున నిరసనలు కొనసాగి ంచారు. సీఎం మమతా బెనర్జీ తమ డిమాండ్లను నెరవేర్చేందుకు హామీ ఇవ్వడంతో.. 42 రోజుల పాటు కొనసాగిన నిరసనలు విరమిం చి గత నెల 21న పాక్షికంగా విధుల్లో చేరారు. అయితే ప్రభు త్వం నుంచి సానుకూల చర్యలు లేకపోవడంతో నిరవధిక ని రాహార దీక్ష చేస్తున్నారు. దీక్షలో పాల్గొన్న పలువురు అనారో గ్యానికి గురవుతుండటంతో సీనియర్ వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం త్వరగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా డబుల్ ఇంజిన్ సర్కారు కృషి: లంకా దినకర



విజయవాడ: గత ఐదేళ్లలో వైకాపా హయాంలో కేంద్ర నిధులు పక్కదారి పట్టించారని భాజపా నేత లంకా దినకర్ విమర్శించారు. 20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడారు. స్వర్ణాంధ్ర సాధనకు అందరం కలిసి కృషి చేస్తామన్నారు. 20 సూత్రాలు అందరికీ తెలిసేలా అన్ని కలెక్టరేట్ల వద్ద ఉంచుతామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం అన్ని రకాలుగా రాష్ట్రానికి సహకారం అందిస్తోందని పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు వెంట తామంతా నడుస్తామని చెప్పారు. అర్హులైన అందరికీ పథకాలు అందించేందుకు సీఎం కృషి చేస్తున్నారని వివరించారు. రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా డబుల్ ఇంజిన్ సర్కారు పనిచేస్తోందని లంకా దినకర్ తెలిపారు.

# ఎడిటోరియల్

## పరువుచేటు పనులు!

అంతర్జాతీయంగా సంచలనం సృష్టించే హత్యలూ, హత్యాయత్నాలూ ఒక్కోసారి ఉలిక్కిపడేలా చేస్తాయి. వాటి వెనక ప్రభుత్వాల ప్రమేయం ఉన్నదన్న అనుమానాలు తలెత్తితే అవి మరింత ఆసక్తిని రేకెత్తిస్తాయి. చాలా సందర్భాల్లో అవి దేశాలమధ్య చిచ్చు రేపుతాయి. ఇలాంటి ఆపరేషన్లను గుట్టుచప్పుడు కాకుండా చేయడంలో ఇజ్రాయెల్ గూఢచార సంస్థ మొసాద్ ఆరితేరింది. చేతికి నెత్తురంటకుండా, సాక్ష్యాధారాలేమీ మిగలకుండా ప్రత్యర్థులను మట్టుబెట్టడంలో ఆ సంస్థ తర్వాతే ఎవరినైనా చెప్పుకోవాలి. అలాంటి ఉదంతంలో ఇప్పుడు మన దేశం పేరు వినబడటం ఆశ్చర్యకరమే. అమెరికాలో స్థిరపడిన ఖలిస్తాన్ వేర్పాటువాద నాయకుడు గురుపత్వంత్ సింగ్ పన్నూపై హత్యాయత్నం కేసులో అమెరికాలో దాఖలైన తాజా నేరారోపణ పత్రం ప్రస్తుతం ప్రకంపనలు సృష్టిస్తోంది. నిజానికి ఏడాదికాలంగా ఆ పంచాయతీ నడుస్తోంది. నేరుగా భారత్‌ను నిందించక పోయినా నిరుడు మే నెలలో దాఖలు చేసిన నేరారోపణ పత్రం తమ గడ్డపై తమ పౌరుడిని హత్య చేసేందుకు జరిగిన ప్రయత్నం వెనక 'భారత ప్రభుత్వంలో పనిచేసే ఒక ఉద్యోగి ప్రమేయం ఉన్నద'ంటూ ఆరోపించింది. అప్పట్లో ఆ ఉద్యోగి పేరు వెల్లడించకుండా 'సీసీ 1'గా మాత్రమే ప్రస్తావించింది. కానీ శుక్రవారం అమెరికా న్యాయశాఖ అతని పేరు వికాస్ యాదవ్ అనీ, భారత గూఢచార సంస్థ రీసెర్చ్ అండ్ అనాలిసిస్ వింగ్ (రా)లో ఇంతక్రితం పనిచేశాడనీ వెల్లడించింది. వికాస్ యాదవ్ ప్రస్తుతం భారత ప్రభుత్వ ఉద్యోగి కాదని నేరారోపణ పత్రం చెప్పటం... భారత ప్రభుత్వం ఈ కేసులో తమకు సహకరిస్తున్నదని విదేశాంగ శాఖ ప్రతినిధి మాథ్యూ మిల్లర్ అనటం ఉన్నంతలో ఊరట. తమ దేశంలో స్థిరపడిన ఖలిస్తాన్ వేర్పాటువాద నాయకుడు హర్దీప్‌సింగ్ నిజ్జర్ హత్యలో భారత్ ప్రమేయం ఉన్నదని ఒకపక్క కెనడా ఆరోపిస్తున్న తరుణంలో అమెరికా సైతం ఇదే తరహా ఆరోపణ చేయటం గమనించదగ్గది. ఎన్నికల్లో సిక్కు ఓటు బ్యాంకును దృష్టిలో ఉంచుకుని కెనడా ప్రధాని ట్రూడో తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని కొట్టిపారేసిన మన దేశానికి తాజా పరిణామం ఇబ్బంది కలిగిస్తుందనటంలో సందేహం లేదు. ఎందుకంటే గురుపత్వంత్‌ను హతమార్చటానికి ఏమేం చేయాలో నిందితులు చర్చించుకున్న సందర్భంలోనే నిజ్జర్ హత్యను జయప్రదంగా పూర్తిచేయటం గురించిన ప్రస్తావన వచ్చింది. ఇలాంటి వ్యవహారాలు చక్కబెట్టే వారికి వేయి కళ్లుండాలి. తాము ఎవరిని సంప్రదిస్తున్నామో క్షుణ్ణంగా తెలిసివుండాలి. కానీ ఆ సమయంలో రా సీనియర్ అధికారిగా ఉన్న వికాస్ యాదవ్ మాదకద్రవ్య ముఠాలతో సంబంధాలుండే నిఖిల్ గుప్తాకు గురుపత్వంత్‌ను అంతంచేసే బాధ్యత అప్పగించటం, గుప్తా దాన్ని కాస్తా కిరాయి హంతకుడనుకున్న మరో వ్యక్తికి ఇవ్వటంతో కథ అడ్డం తిరిగింది. నిఖిల్ గుప్తా చెక్ రిపబ్లిక్‌లో దొరికిపోవటం, అతన్ని ఆ దేశం అమెరికాకు అప్పగించటం పర్యవసానంగా మొత్తం పథకం బట్టబయలైంది. కిరాయి హంతకుడనుకున్న వ్యక్తి కాస్తా అమెరికా మాదకద్రవ్య నిరోధక విభాగం ఏజెంటు. ఆ సంగతి తెలియక హత్య కోసం అతనితో లక్ష డాలర్లకు కాంట్రాక్టు కుదుర్చుకోవటం, అందులో 15 వేల డాలర్లు చెల్లించటం నిఖిల్ గుప్తాతోపాటు వికాస్ మెడకు చుట్టుకుంది. అది మన దేశ ప్రతిష్ఠకు కూడా మచ్చ తెచ్చింది. వికాస్ సాధారణ అధికారి కాదు. రా సంస్థకు ముందు ఆయన సీఆర్‌పీఎఫ్‌లో పనిచేశాడు. వికాస్‌ను సర్వీసునుంచి తొలగించి అతనికోసం గాలిస్తున్నామని మన ప్రభుత్వం ఇచ్చిన వివరణకు అమెరికా సంతృప్తి చెందింది. 'రా'లో ఉన్నతాధికారులకు చెప్పకుండా వికాస్ యాదవ్ ఇలాంటి పెడధోరణులకు పాల్పడ్డాడని మన ప్రభుత్వం చెబుతోంది. విదేశాల్లో గూఢచర్యం ఆషామాషీ కాదు. అలాంటి పనిలో నిమగ్నమైవుండేవారు ఉన్నతాధి కారులకు తమ కార్యకలాపాలపై ఎప్పటికప్పుడు వర్తమానం అందిస్తే వేరే విషయం. చెప్పినా చెప్ప కున్నా అంతా సవ్యంగా జరిగితే రివార్డులు దక్కవచ్చేమో. కానీ వికటిస్తే ఆ అధికారితోపాటు దేశం పరువు కూడా పోతుంది. గురుపత్వంత్ ఖలిస్తాన్ వేర్పాటువాదే కావొచ్చు. ఆ ఉద్యమంలో కీలక పాత్ర పోషిస్తున్న వ్యక్తే అయివుండొచ్చు. మన దేశంలో కేసులుంటే తమకు అప్పగించాలని అమె రికాను కోరాలి. ఆ దేశ పౌరుడిగా అక్కడే స్థిరపడిన వ్యక్తిపై అంతకుమించి ఏదో సాధించాలనుకోవటం తెలివితక్కువతనం. అసలు ఒక వ్యక్తిని భౌతికంగా లేకుండా చేసినంత మాత్రాన ఉద్యమం ఆగిపోతుందా? అతని సహచరులు భయకంపితులై ఉద్యమానికి దూరమవుతారా? ఏం సాధిద్దామని వికాస్ ఇలాంటి పనికి సిద్ధపడ్డాడో తేల్చటం అవసరం. వికాస్ యాదవ్ విషయంలో ఇంత పట్టుదలగా పనిచేస్తున్న అమెరికా చరిత్ర కూడా తక్కువేమీ కాదు. 2003 నాటి రవీందర్ సింగ్ వ్యవహారమే ఇందుకు ఉదాహరణ. 'రా'లో సంయుక్త కార్య దర్శిగా ఉన్న రవీందర్ అమెరికా గూఢచార సంస్థ సీఐఏకు డబుల్ ఏజెంటుగా పనిచేసి పాకిస్తాన్, అఫ్ఘానిస్తాన్ వగైరా దేశాల్లో రా కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం అందజేశాడు. తనసంగతి బయటపడిందని గ్రహించగానే కుటుంబంతో సహా మాయమై అమెరికాలో తేలాడు. వారికి అక్కడ మారు పేర్లతో పాస్‌పోర్టులు కూడా మంజూరయ్యాయి. విచిత్రంగా మన దేశం అతన్ని అప్పగించాలని పట్టుబట్టలేదు. ఉద్యోగంనుంచి తొలగించి అధికార రహస్యాల చట్టం కింద కేసు పెట్టడంతో సరిపెట్టింది. 2016లో ఒక రోడ్డు ప్రమాదంలో రవీందర్ మరణించాడని అంటున్నా దాన్ని ధ్రువీకరించే సమాచారం మన ప్రభుత్వం దగ్గరలేదు. మొత్తానికి గూఢచర్యం వికటిస్తే ఏమవుతుందో వికాస్ యాదవ్ ఉదంతం తెలియజెబుతోంది.

# ఎంపీ ల్యాడ్స్ ఫెసిలిటేషన్ సెంటర్ ప్రారంభం





రాయల్ జర్నలిజం,బాపట్ల, అక్టోబర్ 19: సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని బాపట్ల పార్లమెంటు సభ్యులు, లోక్ సభ ప్యానల్ స్పీకర్, హోమ్ వ్యవహారాల స్టాండింగ్ కమిటీ తెన్నేటి కృష్ణ ప్రసాద్ తెలిపారు. కలెక్టరేట్ ఆవరణలో రూ. ఐదు లక్షల నిధులతో ఏర్పాటుచేసిన ఎంపీ ల్యాడ్స్ ఫెసిలిటేషన్ సెంటర్ ను పార్లమెంట్ సభ్యులు శనివారం రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. అనంతరం ఎంపీ, జిల్లా కలెక్టర్, బాపట్ల శాసనసభ్యులు కలిసి జ్యోతి వెలిగించారు. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న నిధుల వినియోగంలో పారదర్శకత ఉండాలని పార్లమెంటు సభ్యులు చెప్పారు. జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని ప్రజలకు తెలియపరచాలన్నారు. బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గంలో ఎస్సీ జనాభా అధికంగా ఉండడంతో వారి అభ్యున్నతికి కృషి చేయాలన్నారు. ప్రతి ఏటా ఎంపీ ల్యాడ్స్ కింద పార్లమెంట్ నియోజకవర్గానికి రూ. ఐదు కోట్ల నిధులు పార్లమెంట్ నుంచి విడుదలవుతాయన్నారు. వాటిని ఎస్సీ, ఎస్టీలు అధికంగా ఉన్న ప్రాంతాలలో అభివృద్ధికి కేటాయిస్తామన్నారు. కేంద్రం నిధులను పర్యవేక్షించడానికి ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్షలు జరపాల్సి ఉందన్నారు. కేంద్రం నిధులు మంజూరయ్యే ఆయా శాఖల అధికారులంతా సమన్వయంతో పని చేస్తే జిల్లా ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని ఆయన వివరించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి, జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ, సిపిఓ శ్రీనివాసులు, ఆర్ డి ఓ పి గ్లోరియా, తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహం సామాజిక దురాచారం

రాయల్ జర్నలిజం,బాపట్ల, అక్టోబర్ 19 : బాల్య వివాహం సామాజిక దురాచారమని,పర్సనల్ చట్టాలు, వాటిలోని సాంప్రదాయాలు బాల్య వివాహ చట్టాన్ని అడ్డుకోజాలవని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్,జస్టిస్ జేబీ పార్దివాల,జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం తీర్పు వెలువరించింది. బాల్య వివాహాల నిర్మూలనకు,బాల్య వివాహ నిరోధక చట్టం అమలుకు జిల్లాస్థాయిలో ప్రత్యేకంగా కొందరు అధికారులను నియమించాలని, వారికి ఇతర బాధ్యతలు ఏవి అప్పగించకూడదని సుప్రీంకోర్టు ప్రభుత్వాలకు తెలియజేసింది. హౌప్రతి మూడు నెలలకు ఒకసారి సర్వే నిర్వహించాలని జిల్లా స్థాయిలో బాల్య వివాహాల నిరోధించే బాధ్యత ఆయా జిల్లాల కలెక్టర్లు ఎస్పీలు తీసుకోవాలని సుప్రీంకోర్టు తెలియజేసింది. సుప్రీంకోర్టు తీర్పు ను స్వాగతిస్తూ శనివారం బాపట్ల ఉమెన్స్





ఇంజనీరింగ్ కాలేజీ వారితో " చైల్డ్ ట్రాఫికింగ్,హౌ బాల్య వివాహ రహిత భారతదేశం" అనే అంశాలపై అవగాహన ర్యాలీ, మానవహారం కార్యక్రమాన్ని జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ, యాక్సెస్ టు జస్టిస్, సిఫార్డు స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డి ఆర్ ఓ సత్తిబాబు, డిడి సోషల్ వెల్ఫేర్ రాజా ది బోరా, డిఇఓ నారాయణ, ఐసిడిఎస్ పిడి కే ఉమా, ఎంఈఓ ప్రసాద్ రావు, జిల్లా బాలల పరిరక్షణ అధికారి పి పురుషోత్తమరావు, బాలల పరిరక్షణ అధికారి కృష్ణ, ఉమెన్స్ ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి శ్రీనివాసరావు, సిబ్బంది, యాక్సిస్ టు జస్టిస్ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ పి ప్రసాద్ బడుగు కిషోర్, ఎస్ ఎఫ్ ఐ ఆర్ డి రోజ్ ప్రసాద్,గుదే రాజారావు, నాగరాజు, శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

# ఏకాగ్రత, సాధన, శిక్షణతో విజయం తధ్యం

### 68వ అంతర్ జిల్లాల రైఫిల్ షూటింగ్ టోర్నమెంట్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే బత్తుల బలరామ కృష్ణ

రాయల్ జర్నలిజం,రాజమహేంద్రవరం , అక్టోబర్ 19 : ఏకాగ్రత, సాధన, తర్ఫీదు ఉంటే ఏ రంగంలోనైనా విజయాలు సాధ్య మవుతాయని రాజానగరం శాసన సభ్యులు బత్తుల బలరామ కృష్ణ అన్నారు. ఏపీ పాఠశాల విద్యా శాఖ క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో సంపత్ నగర్ లోని రాజమహేంద్రి ఇంటర్నేషనల్ స్కూల్ లో 68వ ఏపీ అంతర్ జిల్లాల రైఫిల్ షూటింగ్ టోర్నమెంట్ 2024-25 ను శనివారం ఎమ్మెల్యే బత్తుల బలరామ కృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన ప్రారంభోత్సవ సభకు రాజమహేంద్రి ఇంటర్నేషనల్ స్కూల్ చైర్మన్ డాక్టర్ టీ.కే. విశ్వేశ్వర రెడ్డి అధ్యక్షత వహించారు. సభలో బలరామ కృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 13 జిల్లాల నుంచి తల్లి తండ్రులు ఎంతో నమ్మకంతో తమ పిల్లలను రైఫిల్ షూటింగ్ పోటీల కోసం ఇంత దూరంలోని రాజమహేంద్రి ఇంటర్నేషనల్ స్కూల్ నకు పంపించడం అభినందనీయమని,ఆ మేరకు తల్లి తండ్రుల నమ్మకాన్ని నిలబెట్టి పోటీలో విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. స్పోర్ట్స్ గేమ్స్ లో విజయం సాధిస్తే స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు వస్తున్నాయని చెప్పారు. ఆ దిశగా అడుగులు వేసేందుకు సంకల్ప బలం చూపాలని కోరారు. మూడు రోజుల పాటు జరిగే ఈ రైఫిల్ టోర్నమెంట్ కు ఆతిథ్య మిచ్చిన రాజమహేంద్రి ఇంటర్నేషనల్ స్కూల్ చైర్మన్ డాక్టర్ టీకే విశ్వేశ్వర రెడ్డిని ఆయన అభినందించారు. తూర్పు గోదావరి జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య కార్యదర్శి ఎస్. ఆర్. కె. వి. స్వామిమాట్లాడుతూ ఈ రైఫిల్





టోర్నమెంట్ రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల అండర్ 14,17, 19 ఏళ్ల బాలురు, బాలికల విభాగంలో ఈనెల 19 నుంచి 21 వ తేదీ వరకు జరుగుతాయని తెలిపారు. ఇక్కడ ఎంపికైన విజేతలుమధ్యప్రదేశ్, భోపాల్ లో జరిగే జాతీయ పోటీలకు అర్హత సాధిస్తారని చెప్పారు. అధ్యక్షత వహించిన డాక్టర్ టీ.కే. విశ్వేశ్వర రెడ్డి మాట్లాడుతూ పిల్లలుక్రీడా స్ఫూర్తిని అలవర్చుకోవడం ద్వారా భవిష్యత్తులో రాణించి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకుంటారని తెలిపారు. తమ రాజమహేంద్రి ఇంటర్నేషనల్ స్కూల్ లో నాణ్యమైన విద్యతో వ్యక్తిత్వ వికాసానికి వీలుగా ఆర్చరీ, హార్స్ రైడింగ్, రైఫిల్ షూటింగ్,మార్షల్ ఆర్ట్స్ వంటి క్రీడలను ప్రవేశ పెట్టిక్రీడా రంగానికి ఊతమిస్తున్నామని పేర్కొన్నారు . తమ పాఠశాలలో చేరే ప్రతి విద్యార్థి స్వీయ ప్రతీభతో ఐఎఎస్, ఐపీఎస్ అయ్యేందుకు కంకణ బద్దులమై ఉన్నామని స్పష్టం చేశారు. లేత రెక్కల విద్యార్థుల భుజాలకు అరబస్తా పాఠ్యపుస్తకాలు భారం కాకుండా ఉండాలని,అందుకు వీలుగా ల్యాప్ టాప్, పెన్ డ్రైవ్ తో పాఠాలను సులభతరం చేశామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి కె. వాసుదేవ రావు, క్రీడా సమాఖ్య సహాయ కార్యదర్శి రాధా కృష్ణ,ఉప విద్యాశాఖాధికారి నారాయణ, రాజానగరం సీఐ వీరయ్యగౌడ్, రాజమహేంద్రి ఇంటర్నేషనల్ స్కూల్ డైరెక్టర్ టీ. స్వరూప్ రెడ్డి, ప్రిన్సిపాల్ టి. వి. డి. చంద్ర శేఖర్,సంపత్ నగర్ ఎంపీటీసీ సదానంద కిశోర్, తిరుమల నాధుని నాని, చిన బాబు, నల్లా దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ఆదర్శ మయూరిలో అన్నదానం



మండపేట (రాయల్ జర్నలిజం): ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు తనయుడు, వైసిపి యువ నేత తోట పృథ్వీరాజ్ పుట్టినరోజు వేడుకలు మండపేట పట్టణ వైసిపి కార్యాలయంలో ఘనంగా జరిగాయి. మండపేట మున్సిపల్ చైర్మన్ పతివాడ రాణి, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు రెడ్డి రాధాకృష్ణ ,మారేడుబాక సర్పంచ్ మట్టపర్తి గోవిందరాజు, కౌన్సిలర్లు పిల్లి శ్రీనివాస్, మారిశెట్టి సత్యనారాయణ స్వామి, పార్టీ నాయకులు ముక్కా దాలయ్య, పెంకే గంగాధర్, శెట్టి నాగేశ్వరరావు, అలీఖాన్ బాబా, మొండిభవాని మురళి, సాధనాల శివభగవాన్ తదితరులు పాల్గొని కేక్ కటింగ్ జరిపారు. అనంతరం ఆదర్శ హెల్పింగ్ హాండ్స్, మయూరి వృద్ధాశ్రమం సంస్థలలో వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు ఇప్పనపాడు సత్యనారాయణ, బిళ్ళకుర్తి అంజి, వల్లు ప్రశాంత్, గణేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఇరు గ్రామాల మధ్య వాగు ప్రవాహం నిలిచిన రాకపోకలు

### వాగు ప్రవాహాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే కాకర్ల సురేష్..



రాయల్ జర్నలిజం,కలిగిరి,అక్టోబర్ 19 :కలిగిరి మండలం గంగిరెడ్డి పాలెం పంచాయతీ బట్టువారి పాలెం గ్రామానికి గంగిరెడ్డి పాలెం గ్రామానికి మధ్యలో ఉన్న వాగు శనివారం కురిసిన భారీ వర్షానికి ఉధృతంగా ప్రవహించడంతో ఇరు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. బట్టు వారి పాలెం గ్రామం నుండి విద్యార్థులు కానీ గ్రామస్తులు గాని గంగిరెడ్డిపాలెం రావడానికి ఎంతో వ్యయప్రయాసలకు లోను కావలసి వస్తుంది. ఆ వాగు సుమారు నడుము లోతు ప్రవహిస్తుండడంతో వాహన రాకపోకలు నిలిచిపోయాయి. కనీసం అత్యవసర పనులపై కూడా వెళ్లేందుకు వీలు లేకుండా పోయిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేవలం మినీ బ్రిడ్జి అయినా ఏర్పాటు చేసినట్లయితే పరిష్కారమవుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో శనివారం ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ గ్రామానికి చేరుకుని వాగు ప్రవాహాన్ని స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్తుల కోరిక మేరకు సంబంధింత ఉన్నతాధికారితో ఫోన్లో మాట్లాడుతూ గతంలో జరిగిన ఎస్టిమేషన్ కాకుండా ప్రస్తుతం తాజాగా బ్రిడ్జి ఏర్పాటుకు అంచనాలు



ఎస్ మాధవ తహసిల్దార్ చొప్ప రవీంద్రబాబు వింజమూరు ఆర్డబ్ల్యూఎస్ ఏఈ కే వరప్రసాద్ స్థానిక నాయకులు కె శ్రీనివాసులు బొమ్ము కొండారెడ్డి పిచ్చిరెడ్డి ఆర్ శ్రీనివాసులు బొమ్ము మల్యాద్రి లెక్కల మాల్యాద్రి వేములపాటి మల్లెం కొండయ్య లెక్కల మాల్యాద్రి షేక్ రంతుల్లా పోలు జయరాం రెడ్డి ఎల్ కొండారెడ్డి గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

# ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు: ఏవో కిరణమై



రాయల్ జర్నలిజం (కాకుమాను): కాకుమాను మండలంలోని మండల వ్యవసాయ అధికారి వారి కార్యాలయం నందు శనివారం మండల స్థాయి డీలర్ల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో భాగంగా మండల వ్యవసాయ అధికారి కిరణమై మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులు, పురుగుమందులు అమ్మకాలు జరగాలని ఎవరైనా అధిక ధరలకు అమ్మితే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది అన్నారు . అలా ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే అధికారులువిధించే కఠిన చర్యలు తీసుకొనబడుతుందని తెలియజేయడం జరిగింది. అంతేకాకుండా ఇంటర్నల్ స్క్వాడ్ మండలంలో ఎప్పుడైనా ఏ షాప్ కైనా ఇన్స్పెక్షన్ చేయవచ్చునని. వీటిలో భాగంగా మీ దగ్గర ఉండవలసిన పీ.సీ, ఫైలు అన్ని కంపెనీ వైస్ గా ఏర్పాటు చేసుకోవాలని ఎప్పటికప్పుడు స్టాక్ రిజిస్టర్ అప్డేట్ చేసుకోవాలని ఓ ఫార్మ్ చేసుకోవాలని ఆఫైలు కరెక్ట్ గా ఆర్డర్ వైస్ గా పెట్టుకోవాలని , ప్రతి రైతుకు వాళ్ళు కొనుగోలు చేసిన ఎరువులు, పురుగుమందుల బిల్లు కొనుగోలు చేసిన రైతుల పేరు మీద వారి సంతకాలతో రైతులకు అందజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని ఎరువులు, పురుగు మందు షాపులో డీలర్లు పాల్గొన్నారు.

# శ్రీవారి భక్తులు, ఎమ్మెల్యేలకు గుడ్ న్యూస్ చెప్పిన చంద్రబాబు

అమరావతి : కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వరస్వామి కొలువుతీరిన తిరుమలలో శ్రీవారిని దర్శించుకోవడానికి భక్తులు పోటీ పడుతుంటారు. అధికారంలో ఉన్న నాయకుల సిఫారసు లేఖలను తీసుకొని వెళ్లి తిరుమలలో శ్రీవారిని దర్శించుకుంటారు. తిరుమలలో శ్రీవారి బ్రేక్ దర్శనం కోసం ఆంధ్రప్రదేశ్ కు చెందిన అన్ని పార్టీల ఎమ్మెల్యేలు, ఎంపీల సిఫారసు లేఖల్ని టీటీడీ అధికారులు తీసుకుంటారు. ప్రజా ప్రతినిధుల సిఫారసు లేఖలతో టీటీడీ అధికారులు ఆ లేఖలు తీసుకెళ్లిన భక్తులకు స్వామివారి దర్శనం చేసుకోవడానికి అవకాశం కల్పిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ కు చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీల సిఫారసు లేఖలు తీసుకెళుతున్న భక్తులు తిరుమలలో శ్రీవారిని దర్శించుకుంటున్నారు. ముఖ్యంగా బ్రేక్ దర్శనానికి ఎమ్మెల్యేలు, ఎంపీల సిఫారసు లేఖలను ప్రతి రోజు వేల సంఖ్యలో టీటీడీ అధికారులకు చేరుతుంటాయి. వాటిని పరిశీలించిన టీటీడీ అధికారులు స్వామివారిని దర్శించుకోవడానికి భక్తులకు అవకాశం కల్పిస్తుంటారు. అయితే ప్రజా ప్రతినిధుల సిఫారసు లేఖలకు కొన్ని కండిషన్స్ ఉన్నాయి. ప్రస్తుతం ఆ కండిషన్స్ సవరిస్తూ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్ణయం తీసుకున్నారు. తిరుమల శ్రీవారి దర్శనానికి ప్రస్తుతం వారం రోజుల్లో నాలుగు రోజులు ఎమ్మెల్యేలు ఇచ్చిన సిఫారసు లేఖలను టీటీడీ అధికారులు అనుమతిస్తున్నారు. ఇకముందు ఎమ్మెల్యేలు ఇచ్చిన సిఫారసు లేఖలను ఆరు రోజులపాటు అనుమతి ఇచ్చేందుకు సీఎం చంద్రబాబు నాయుడు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. వారంలో ఆరు రోజులు ఎమ్మెల్యేలు ఇచ్చిన సిఫారసు లేఖల్ని టీటీడీ అధికారుల పరిశీలించి ఆ లేఖలు తీసుకువెళ్లిన భక్తులకు తిరుమలలో శ్రీవారి దర్శనానికి వెళ్లడానికి అనుమతి ఇవ్వాలని చంద్రబాబు నాయుడు కూటమి ప్రభుత్వం అంగీకరించింది. అలాగే ఆరు రోజులపాటు 300 రూపాయలు టికెట్లు ఆరు ఇవ్వడానికి ఎమ్మెల్యేలకు అవకాశం ఇవ్వడానికి సీఎం చంద్రబాబు నాయుడు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఇదే సమయంలో తిరుమల శ్రీవారి దర్శనం టికెట్ల విషయంలో ప్రజా ప్రతినిధులు అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఎం చంద్రబాబు నాయుడు హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ లోని 175 నియోజకవర్గాల్లోని ఎమ్మెల్యేలు అందరికీ తిరుమల శ్రీవారి దర్శనానికి వెళ్లే భక్తులకు సిఫారసు లేఖలు ఇచ్చే అవకాశం ఉంటుంది.

# ఎయిరిండియా, విస్తారా ఫ్లైట్‌కు బాంబు బెదిరింపు- కలకలం




న్యూఢిల్లీ : దేశంలో పౌర విమానయాన సంస్థలకు బాంబు బెదిరింపులు తీవ్రతరం అయ్యాయి. ఈ మధ్యకాలంలో వరుసగా ఇలాంటి బెదిరింపులు అందుతోన్నాయి. రెండు వారాల వ్యవధిలో ఎనిమిది విమానాలకు ఇలాంటి ఇ-మెయిల్స్ అందాయి. ప్రయాణికులను తీవ్ర భయభ్రాంతులకు గురి చేశాయి. ఇప్పుడు తాజాగా మరోసారి అలాంటి ఉదంతమే చోటు చేసుకుంది. దుబాయ్ నుంచి భారత్‌కు వస్తోన్న ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమానానికి బాంబు బెదిరింపు అందింది. ఈ మేరకు గుర్తు తెలియని ఐపీ అడ్రస్ నుంచి ఇ-మెయిల్ అందింది. ఈ విషయాన్ని ఎయిరిండియా, డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ ధృవీకరించింది. ఐఎక్స్ 196 విమానం అది. 189 మంది ప్రయాణికులు, సిబ్బందితో దుబాయ్ నుంచి బయలుదేరి రాజస్థాన్ రాజధాని జైపూర్‌కు బయలుదేరింది. మార్గమధ్యలో ఉన్నప్పుడే అంటే శుక్రవారం అర్ధరాత్రి దాటిన తరువాత 12:45 నిమిషాలకు బాంబు బెదిరింపు ఇమెయిల్ అందింది. 1:20 నిమిషాలకు జైపూర్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ల్యాండ్ అయిన.. వెంటనే విమానం మొత్తాన్నీ క్షున్నంగా తనిఖీ చేశారు. ఎలాంటి అనుమానాస్పద వస్తువులు గానీ, పేలుడు పదార్థాలు గానీ లభించలేదని జైపూర్ ఎయిర్‌పోర్ట్ పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ సందీప్ బసేరా తెలిపారు. దీనితో అందరూ ఊపిరి పీల్చుకున్నారు .ఎయిరిండియా విమానాలకు బాంబు బెదిరింపులు అందడం వరుసగా ఇది ఆరో రోజు కావడం గమనార్హం. ఢిల్లీ- లండన్ విస్తారా విమానానికి బెదిరింపులు అందడంతో ఫ్రాంక్‌ఫర్ట్‌కు మళ్లించాల్సి వచ్చింది. శుక్రవారం ఢిల్లీ నుంచి లండన్ బయలుదేరి వెళ్లిన యూకే 17 విస్తారా విమానంలో బాంబులు పెట్టినట్లు బెదిరింపులు అందడంతో దాన్ని ఫ్రాంక్‌ఫర్ట్‌లో ల్యాండ్ చేశారు. అంతకుముందు ఆకాశ ఎయిర్‌వేస్ విమానం క్యూపీ 1366కు బెదిరింపులు అదాయి. బెంగళూరు నుంచి ముంబై బయలుదేరి వెళ్లాల్సిన విమానం ఇది. టేకాఫ్ కావడానికి కొద్ది నిమిషాల ముందు గుర్తు తెలియని వ్యక్తులు ఎక్స్ హ్యాండిల్ ద్వారా బెదిరించడం వల్ల వల్ల ఆలస్యంగా ఇది బయలుదేరాల్సి వచ్చింది. ఎయిరిండియాకు చెందిన 40 విమానాలకు ఇలా బెదిరింపులు అందాయి.

# రైతు భరోసా నిధుల జమ పై బిగ్ అప్డేట్ - వారికి కోత..!



అమరావతి :ఏపీ ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీల అమలు పైన ఫోకస్ చేసింది. అధికారికంగా హామీల అమలు క్యాలెండర్ ప్రకటనకు సిద్ధం అవుతోంది. దీపావళి నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం ప్రారంభించాలని నిర్ణయించారు. అమ్మకు వందనం పైనా చర్చ జరుగుతోంది. ఇదే సమయంలో రైతులకు ఇచ్చిన హామీ మేరకు అన్నదాత సుఖీభవ పథకం అమలు విషయంలో ప్రభుత్వం తాజాగా ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. కూటమి నేతలు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో అన్నదాత సుఖీభవ ప్రధానమైనది. వైసీపీ ప్రభుత్వ హాయంలో అమలు చేసిన రైతు భరోసా పథకాన్ని అన్నదాత సుఖీభవ పేరుతో అమలు చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పథకం కింద నిధుల విడుదల ఎప్పుడు చేసే అవకాశం ఉంటుందనే దాని పైన ప్రభుత్వంలో చర్చ మొదలైంది. ఆర్థిక శాఖ కసరత్తు తరువాత ప్రస్తుత సంవత్సరంలో ఈ పథకం అమలు సాధ్యపడదనే అంశం స్పష్టం అవుతోంది. వచ్చే ఆర్థిక సంవత్సరంలోనే ఈ పథకం అమలు కానుందని సమాచారం. 2024-25 పూర్తి స్థాయి బడ్జెట్‌ను నవంబర్‌లో ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం కసరత్తు మొదలు పెట్టింది. ఈ బడ్జెట్ లో అన్నదాత సుఖీభవ పథకం కోసం నిధులను ప్రస్తావన చేయకుండా.. పథకం హామీ పైనే మరోసారి స్పష్టత ఇచ్చే అవకాశం ఉంది. ఉచిత గ్యాస్ సిలిండర్లు, విద్యార్థుల ఫీజులకు 'తల్లికి వందనం', నిరుద్యోగ భృతి వంటి హామీల అమలుపై దృష్టి పెట్టిన ప్రభుత్వం, రైతులకు ఆర్థిక సాయం అందించే అన్నదాత సుఖీభవను మాత్రం వచ్చే ఆర్థిక సంవత్సరంలో అమలు చేసేలా ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. తాజా వరదల్లో పంటలు నష్టపోయిన రైతుల్లో కొందరికే ఇన్‌పుట్ సబ్సిడీ అందింది. బీమా పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. రైతులకు, కౌలు రైతులకు ఏటా రూ.20 వేల ఆర్థిక సాయం చేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో కూటమి హామీ ఇచ్చింది. ఇప్పటి వరకు రైతులు ఈ పథకం నిధులు రబీలో ఇస్తారా, జనవరిలో సంక్రాంతి కి ఇస్తారా అనే ఆశతో ఉన్నారు. కానీ, ఇప్పుడు ప్రభుత్వం వచ్చే ఆర్థిక సంవత్సరంలో తొలి నెలలో ఏప్రిల్ లో విడుదల చేసే ఆలోచనతో ఉందని తెలుస్తోంది. అదే జరిగితే ఒక ఏడాది సాయం రూ.20 వేలను రైతులు, కౌలు రైతులు కోల్పోతారు. పీఎం కిసాన్ నిధుల ఖాతా దారుల సంఖ్యలోనూ కోత పడింది. రాష్ట్రంలో 76 లక్షల మంది సొంత భూమి కలిగిన రైతులు, కౌలు రైతులు 8-10 లక్షల మంది ఉన్నారని ప్రభుత్వ లెక్కలే చెబుతు న్నాయి. పలు నిబంధనలతో లబ్ధిదారుల సంఖ్య 41 లక్షలకు తగ్గిపోయింది.

# మోదీ, పవన్‌కు చంద్రబాబు బిగ్ ఆఫర్- కీలక మలుపు..!



అమరావతి : ఏపీలో రాజకీయం ఆసక్తి కరంగా మారుతోంది. మూడు పార్టీల కూటమి ప్రభుత్వం పలు నిర్ణయాలు తీసుకుంటోంది. జమిలి ఎన్నికల దిశగా కేంద్రం అడుగులు వేస్తోంది. చంద్రబాబు సైతం ఇప్పటికే జమిలికి మద్దతు ప్రకటించారు. ఎన్డీఏ సమావేశం తరువాత పార్టీ నేతలతో చంద్రబాబు కీలక వ్యాఖ్యలు చేసారు. వచ్చే ఎన్నికల కోసం నేతలకు సమాయత్తం చేస్తున్నారు. ఇదే సమయంలో పొత్తుల పైనా చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారుతున్నాయి. కూటమిలోని మూడు పార్టీల పొత్తు కొనసాగాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షిస్తున్నారు. తాజాగా పార్టీ నేతల సమావేశంలో మూడు పార్టీల ఐక్యత గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. మూడు పార్టీల కేడర్ కలిసి కట్టుగా పని చేయాలని సూచించారు. గుజరాత్ లో.. కేంద్రంలో మోదీ వరుస అధికారం దక్కించుకోవటం వెనుక సక్సెస్ గురించి వివరించారు. వచ్చే ఎన్నికల్లోనూ కలిసే వెళ్లాలంటూ చంద్రబాబు ప్రతిపాదించారు. మిత్రపక్షాలను కలుపుకొని వెళ్లాలని పార్టీ ఎమ్మెల్యేలకు చంద్రబాబు సూచించారు. కూటమిగా ఉంటేనే బలం ఉంటుందని తేల్చి చెప్పారు. తాజాగా జరిగిన ఎన్నికల సమయంలోనూ మూడు పార్టీల పొత్తు ఖరారులో పవన్ కీలక పాత్ర పోషించారని చంద్రబాబు స్వయంగా వెల్లడించారు. మొత్తం 164 సీట్లను కూటమి గెలుచుకుంది. అధికారంలోకి వచ్చిన తరువాత కూడా మూడు పార్టీల మధ్య సఖ్యత అదే విధంగా కొనసాగుతోంది. చంద్రబాబు తన మంత్రివర్గంలో పవన్ కు మాత్రమే డిప్యూటీ సీఎం హోదా ఇచ్చారు. పవన్ నిర్ణయాలకు విలువ ఇస్తున్నారు. అదే విధంగా పవన్ సైతం చంద్రబాబు స్పూర్తిగానే పాలనా వ్యవహారాల ను తెలుసుకుంటానని స్పష్టం చేసారు. అటు కేంద్రంలోనూ ఈ సారి ఏపీ విషయంలో ప్రయార్టీ పెరిగింది. ఏపీకి నిధుల విషయంలోనూ సానుకూలంగా వ్యవహరిస్తున్నారు. ఇక, ఏపీలో ప్రస్తుత రాజకీయ సమీకరణాల్లో పవన్ తన పార్టీని మరింత బలోపేతం చేసే ఆలోచన తో ఉన్నారు. వైసీపీ నుంచి కీలక నేతలను తమ పార్టీలోకి చేర్చుకున్నారు. స్థానిక సంస్థల్లో తమ పార్టీకి ప్రాధాన్యత ఉంటుందని కేడర్ కు చెబుతున్నారు. అయితే, ఇక డిప్యూటీ సీఎంగానే కొనసాగాల్సి ఉంటుందా అనే చర్చ కూడా మొదలైంది. పవన్ సీఎం కావాలనేది ఆయన మద్దతు దారుల కోరిక. బీజేపీ సైతం కేంద్రంలో సమీకరణాలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటుంది. దీంతో, ఇప్పుడు చంద్రబాబు వచ్చే ఎన్నికల గురించి ఇప్పుడే చేస్తున్న ప్రతిపాదనల పైన అటు బీజేపీ.. ఇటు జనసేన స్పందన ఏంటనేది ఆసక్తి కరంగా మారుతోంది.

# సచివాలయాలపై తాజా నిర్ణయం - మళ్లింపు, బదిలీలు..!

అమరావతి :సచివాలయాల వ్యవస్థ పూర్తి ప్రక్షాళన దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. వైసీపీ హయాంలో సంక్షేమ పథకాల అమలులో సచివాలయ వ్యవస్థ కీలక పాత్ర పోషించింది. వాలంటీర్లు సైతం సచివాలయాల పరిధిలో పని చేసే వారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాల బాధ్యతలను ఆర్టీజీఎస్ పరిధిలోకి తేవాలని భావిస్తోంది. సచివాలయ వ్యవస్థలో మార్పులతో పాటుగా సిబ్బంది బదిలీల పైన అధికారుల కసరత్తు కొనసాగుతోంది. సచివాలయాలు, వాలంటీర్ల వ్యవస్థ పైన ప్రభుత్వం ఆచి తూచి వ్యవహరిస్తోంది. రెండు వ్యవస్థలను కొనసాగిస్తూనే మార్పులు చేస్తామని చెబుతోంది. అయితే, ఇప్పుడు కీలకమైన సంక్షేమ పథకాల నిర్వహణ బాధ్యతల నుంచి సచివాలయాలను తప్పించేలా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఆర్టీజీఎస్ కు బాధ్యతలు గత ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాల నిర్వహణ..పంపిణీ పూర్తిగా సచివాలయ - వాలంటీర్ల పరిధిలో నిర్వహించేవారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వాలంటీర్ల సేవల పైన తుది నిర్ణయం తీసుకోలేదు. ఇప్పుడు సచివాలయ ఉద్యోగుల బాధ్యతల్లోనూ మార్పులు ఖాయంగా కనిపిస్తున్నాయి. ఇప్పటి వరకు సచివాలయాలు పర్యవేక్షించిన సంక్షేమ పథకాల నిర్వహణను ఇక నుంచి ఆర్టీజీఎస్ కు అప్పగించాలని ప్రభుత్వం భావిస్తోంది. 2014-19 కాలంలో చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో ఆర్టీజీసీఎస్ వ్యవస్థ తీసుకొచ్చారు. రాష్ట్రంలోనీ ప్రతీ ప్రాంతంతోనూ ఈ వ్యవస్థ అనుసంధానం అయి ఉంది. క్షేత్ర స్థాయిలో విపత్తుల నుంచి సాయం వరకు ఎప్పటికప్పుడు సమాచారం సేకరించి ప్రభుత్వానికి నివేదించేది. ఇప్పుడు కొత్త ప్రభుత్వం ఈ సంక్షేమ పథకాల బాధ్యతలను సచివాలయ వ్యవస్థ నుంచి తప్పించి ఆర్టీజీఎస్ కు అప్పగించేలా కసరత్తు చేస్తోంది. ఆర్టీజీఎస్ ను మరిత బలోపేతం చేయాలని నిర్ణయించింది. దీంతో, సచివాలయాల కొనసాగింపు వాటి బాధ్యతల పైన చర్చ మొదలైంది. సచివాలయ వ్యవస్థను పంచాయితీ రాజ్ శాఖలో విలీనం చేస్తారనే ప్రచారం ఉంది. ప్రభుత్వంలోని మంత్రులు మాత్రం సచివాలయ శాఖ కొనసాగుతుందని చెబుతున్నారు. దీంతో, ఇప్పుడు సంక్షేమ పథకాల అమలు పై ప్రభుత్వం తీసుకొనే నిర్ణయం పైన ఆసక్తి నెలకొంది.

# పాము, కుక్క కాట్లకు వ్యాక్సిన్ కావాలా? 15400 నెంబర్‌కు ఒక్క ఫోన్ కొట్టండి!



అమరావతి : దేశంలో పాము, కుక్క కాట్ల కారణంగా మరణాలను నిర్మూలించేందుకు కేంద్ర ప్రభుత్వం వినూత్న ఆలోచనకు తెరలేపింది. కుక్క, పాము కాటులకు గురైన వారికి సత్వర చికిత్స అందించే చర్యల్లో భాగంగా ఓ హెల్ప్‌లైన్ నెంబర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. బాధితులు జాతీయ స్థాయిలో ఏర్పాటు చేసిన 15400 టోల్ ఫ్రీ నంబర్?ను సంప్రదిస్తే వ్యాక్సిన్‌లు ఎక్కడ లభిస్తాయనే సమాచారాన్ని వెంటనే తెలియజేస్తుంది. ఈ కేంద్రం జాతీయ స్థాయిలో ఏర్పాటు చేయగా.. అనుసంధానంగా విజయవాడలో దీనిని ప్రారంభించారు. ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల మధ్య దీనిని కమ్యూనికేట్ అవ్వొచ్చు. ప్రస్తుం ఇంగ్లీష్, హిందీ భాషల్లో అందుబాటులో ఉండగా, అక్టోబర్ 21 నుంచి తెలుగులోనూ సమాధానం ఇచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈ కాల్ ?సెంటర్?ను ఏపీతోపాటు మధ్యప్రదేశ్, దిల్లీ, అస్సాం, పుదుచ్చేరి రాష్ట్రాల్లో నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్(ఎన్‌సీడీసీ), యునైటెడ్ నేషన్ డెవలప్‌మెంట్ ఫండ్(యుఎన్‌డీపీ) సంయుక్తంగా కేంద్ర ప్రభుత్వం ప్రారంభంచింది. సమీప ఆరోగ్య కేంద్రంలో బాధితులకు కుక్క కాటు, పాము కాటుకు వ్యాక్సిన్‌ల లభ్యతతో పాటు ముందస్తు జాగ్రత్తలు వంటి సమాచారం అందించడమేకాకుండా అవగాహన కల్పించేందుకు ఇవి దోహదపడతాయి. ఇందుకు సంబంధించి తెలుగులో ముద్రించిన పోస్టర్లు, కరపత్రాల్ని ఏపీ రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు విడుదల చేశారు. రారున్న 2030 నాటికి కుక్క కాటు వల్ల వచ్చే రేబిస్? వ్యాధిని పూర్తిగా నిర్మూలించాలన్న లక్ష్యంతో దీనిని రూపొందించినట్లు అధికారులు చెబుతున్నారు. మనుషుల్లో నమోదైన రేబిస్ కేసులు 99 శాతం వరకూ కుక్కతోనే వ్యాప్తి చెందుతున్నట్లు వెల్లడైంది. ఈ రేబిస్? వ్యాధి కారణంగా ఏడాదికి 20,000ల మంది వరకు మరణిస్తున్నారు. గత ఏడాది దేశవ్యాప్తంగా 30.43 లక్షల కుక్క కాటు కేసులు నమోదవ్వగా, ఏపీలో 2023లో 2,12,246 కేసులు నమోదయ్యాయి.

# షిండే పై కూటమి చేతికి కొత్త అస్త్రం..!



న్యూఢిల్లీ : మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల వేళ కొత్త వివాదాలు తెర మీదకు వస్తున్నాయి. ఇప్పటికే మహారాష్ట్ర ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. ఎన్డీఏ - ఇండియా కూటముల నేతల సీట్ల సర్దుబాటు పైన చర్చలు చేస్తున్నారు. ఎన్నికల ప్రచారం పైన కసరత్తు ప్రారంభించారు. ఇదే సమయంలో సీఎం షిండే కుమారుడు శ్రీకాంత్ షిండే ఆలయంలోని గర్భగుడి ప్రవేశం కొత్త వివాదంగా మారింది. మహారాష్ట్ర ముఖ్యమంత్రి షిండే కుమారుడు వివాదంలో చిక్కారు. శ్రీకాంత్ షిండే తమ కుటుంబ సభ్యులతో కలిసి ఉజ్జైని నగరంలో ఉన్న మహాకాళేశ్వర దేవాలయంలో అక్కడి నిబంధనలను వ్యతిరేకంగా గర్భగుడిలో ప్రవేశించారు. అక్కడ ఎవరికీ గర్భగుడిలోకి ప్రవేశం ఉండదు. కానీ, సీఎం షిండే కుమారుడు శ్రీకాంత్ షిండే సతీ సమేతంగా గర్భగుడిలోకి ప్రవేశించారు. ఎంపీ అయిన శ్రీకాంత్ షిండే తన భార్య, ఇద్దరు పిల్లలతో మహాకాళేశ్వర ఆలయం గర్భగుడిలో ప్రవేశించి ప్రత్యేక పూజలు చేశారు. దీని పైన ఇప్పుడు ఇండియా కూటమి నేతలు ఆయన్ను టార్గెట్ చేసారు. ముఖ్యమంత్రి కుమారుడు దేవాలయ గర్భగుడిలో ప్రవేశించి.. పూజల్లు చేసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. దాదాపు ఏడాది కాలంలో మహాకాలేశ్వర ఆలయంలోని గర్భగుడి లో నిషేధం అమలవుతోంది. నిషేధం ఉండగా గర్భగుడిలోకి శ్రీకాంత్ షిండేను ఎలా అనుమతిస్తారని కాంగ్రెస్ నేతలు ప్రశ్నిస్తున్నారు. సామాన్యులు దర్శనం కోసం గంటల పాటు నిరీక్షిస్తుంటే షిండే వ్యవహార శైలి సామాన్య భక్తుల మనోభావాలను దెబ్బ తీసేలా ఉందని విమర్శలు చేస్తున్నారు. ద్వాదశ జ్యోతిర్లాంగాల్లో ఒకటిగా మహాకాళేశ్వర ఆలయం ఉంది. నిత్యం వేల సంఖ్యలో భక్తులు దర్శనం కోసం వస్తూ ఉంటారు. ఈ వివాదం పైన కమిటీ ఛైర్మన్ గా వ్యవహరించే ఉజ్జైని కలెక్టర్ నీరజ్ కుమార్ సింగ్ స్పందించారు. గర్భగుడిలోకి ఎవరికీ ప్రవేశం లేదన్నారు. అనుమతి లేకుండా ఎంపీ లోపలకు వెళ్లారని చెప్పారు. దీని పైన చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించినట్లు వెల్లడించారు. విచారణ చేసి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసారు. అయితే, శ్రీకాంత్ షిండే మాత్రం తాము ఆలయాలకు వెళ్తే ప్రతిపక్షాలకు అలర్జీ వస్తుందన్నారు. ఆలయాలకు వెళ్లే వారిని ఆపటానికి ప్రయత్నాలు చేస్తారని ఇండియా కూటమి నేతల పైన మండిపడ్డారు

# సామాన్యుడి ఆశలు గల్లంతు.. ఆర్బీఐ ఇలా షాకిస్తుందని అనుకోలేదు




అమరావతి : వడ్డీరేట్లను తగ్గించేందుకు ఇది సరైన సమయం కాదని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) గవర్నర్ శక్తికాంత దాస్ అన్నారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ.దేశంలో ద్రవ్యోల్బణం పెరిగింది. దీన్ని మరింత తగ్గించే అవకాశాలు కనిపించడం లేదు. అటువంటి పరిస్థితిలో, మేము వడ్డీ రేట్లను తగ్గించే రిస్క్ తీసుకోలేము. ఈ నెలలో జరిగిన ద్రవ్య విధాన కమిటీ (ఎంపిసి) సమావేశంలో వడ్డీ రేట్లను స్థిరంగా ఉంచాలని ఆర్‌బిఐ ప్రకటించింది" అన్నారు. యుఎస్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను తగ్గించిన తర్వాత, ఆర్‌బిఐ కూడా అదే చేయగలదని అందరూ ఊహించారు. అయితే, సెంట్రల్ బ్యాంక్ నిర్ణయంతో సామాన్యులు షాక్ అయ్యారు. బ్లూమ్‌బెర్గ్ ఇండియా క్రెడిట్ ఫోరమ్‌లో ఆర్‌బిఐ గవర్నర్ శక్తికాంత దాస్ మాట్లాడుతూ.. ఇప్పుడు వడ్డీరేట్లను తగ్గించడం సంక్షోభానికి దారితీస్తుందని అన్నారు. దీని కోసం మనం ద్రవ్యోల్బణం రేటును నిశితంగా గమనించాలి. మీ ఆర్థిక వృద్ధిరేటు బాగుంటే ప్రస్తుతం అందులో ఎలాంటి మార్పు అవసరం లేదు. ద్రవ్యోల్బణం రేటు 4 శాతంగా ఉంటే, మేము వడ్డీ రేట్లను తగ్గించడాన్ని తీవ్రంగా పరిశీలిస్తాము. దీని గురించి మనం ఊహించాల్సిన అవసరం లేదన్నారు.

**తదుపరి ఆరు నెలల ద్రవ్యోల్బణం కీలకం**

ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ ప్రకారం.. ద్రవ్యోల్బణం పరంగా రాబోయే ఆరు నెలలు చాలా కీలకం ఉంటాయి. ద్రవ్యోల్బణం నాలుగు శాతం స్థాయికి దిగివస్తుందని శక్తికాంత దాస్ విశ్వాసం వ్యక్తం చేశారు. 2026 ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యోల్బణం రేటు 4 శాతంగా ఉంటుందని ఆర్‌బిఐ డిప్యూటీ గవర్నర్ మైఖేల్ పాత్ర అంతకుముందు సూచించారు. గత వారం ఎంపిసి (మానిటరీ పాలసీ కమిటీ) వరుసగా 10వ సారి వడ్డీ రేట్లను స్థిరంగా ఉంచాలని ప్రకటించింది. డిసెంబర్‌లో జరిగే సమావేశంలో వడ్డీరేట్లను తగ్గించే అవకాశం ఉందని అప్పటి నుంచి ఊహాగానాలు వినిపిస్తున్నాయి. కానీ, ఆర్బీఐ గవర్నర్ మాత్రం ఇప్పట్లో వడ్డీ రేట్లను తగ్గించుకోవాలని అనుకున్నట్లు కనిపించలేదు.

**ఆర్‌బిఐ మారకపు రేటు**

ప్రపంచంలోని ఇతర కేంద్ర బ్యాంకులు వడ్డీ రేట్లను తగ్గించే అంశంపై ప్రస్తుతం వెయిట్ అండ్ సీ పాలసీని పాటిస్తున్నట్లు శక్తికాంతదాస్ తెలిపారు. సరైన సమయం వచ్చినప్పుడే దీనిపై నిర్ణయం తీసుకుంటామన్నారు. ఆర్థిక వ్యవస్థపై ఇతర కేంద్ర బ్యాంకుల నిర్ణయాల ప్రభావం మనం చూస్తున్నామన్నారు. కానీ, మా ప్రాధాన్యత దేశంలో ద్రవ్యోల్బణం, ఆర్థిక వృద్ధి, ఆర్థిక వ్యవస్థనే. ఇది కాకుండా, మేము మారకపు రేటును నిర్వహించడం లేదని శక్తికాంతదాస్ స్పష్టం చేశారు. మన అవసరాలకు అనుగుణంగా డాలర్లు కొని విక్రయిస్తామని తెలిపారు.


రాయల్ జర్నలిజం
ద్విభాషా దినపత్రిక ROYAL JOURNALISM

# ఈ క్షేత్రంలో అడుగు పెడితే చాలు.. సకల పాపాలు పోతాయి.. దెయ్యాలను వదిలిస్తుంది..!




అమరావతి : సాధారణంగా లక్ష్మీ నరసింహస్వామి, కాళికా దేవి, దుర్గాదేవి, ఆంజనేయ స్వామి.. లాంటి దేవతలు, దేవుళు దుష్ట శక్తులను సంహరించేవారుగా పూజలందుకుంటూ ఉంటారు.వారి ఆలయాలను దర్శిస్తే శరీరంపై ఏవైనా గాలి ఉంటే పోతుందని.. దుష్ట శక్తుల పీడ వదులుతుందని నమ్ముతారు. అయితే వీరే కాదు.. ఇలాంటి ప్రత్యేకత ఉన్న ఆలయం ఒకటుంది. అదే.. శ్రీగురు దత్తాత్రేయ క్షేత్రం. ఈ ఆలయం కర్ణాటక రాష్ట్రంలో ఉంది. దీని ప్రత్యేకతలు, విశేషాలను ఇప్పుడు తెలుసుకుందాం.కర్ణాటక రాష్ట్రంలోని గుల్బర్గా జిల్లా అఫ్జల్‌పూర్ తాలూకా భూమా నది ఒడ్డున గనాగపూర్ అనే ప్రాంతంలో శ్రీగురు దత్తాత్రేయ స్వామి ఆలయం ఉంది. ఇక్కడ స్వామికి చెందిన పాదుకలను దర్శించుకుంటారు. ఇక్కడ ప్రవహించే భీమా, అమరాజా అనే నదుల సంగమం చాలా పవిత్రమైందిగా భావిస్తారు. ఇందులో స్నానం చేస్తే సకల పాపాలు తొలగిపోతాయని విశ్వసిస్తారు. ఈ ఆలయానికి చాలా మంది దుష్టశక్తులను వదిలించుకునేందుకు వస్తుంటారు. ఇక్కడికి వస్తే దెయ్యాలను వదిలించుకోవచ్చని నమ్ముతారు. కొందరు ఈ ఆలయంలోకి రాగానే వింతగా ప్రవర్తిస్తారు. ఏవైనా దుష్ట శక్తులు, గాలి ఉంటే ఈ ఆలయానికి వస్తే పోతాయని చెబుతారు.ఇక ఈ ఆలయానికి ఎంతో చరిత్ర ఉంది. ఇక్కడ చుట్టు పక్కల అనేక దర్శనీయ స్థలాలు కూడా ఉన్నాయి. ఇక్కడి భీమా, అమరాజా నదుల సంగమం వద్ద సంగమేశ్వర ఆలయం ఉంది. దీన్ని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకుంటారు. సంగమంలో స్నానం ఆచరించి దైవాన్ని దర్శించుకుంటే సకల పాపాలు తొలగిపోతాయని విశ్వసిస్తారు. అలాగే ఇక్కడికి సమీపంలో అష్ట తీర్థాలు ఉన్నాయి. ఇక్కడ కూడా భక్తులు తమ పాపాలను పోగొట్టుకుంటానికి స్నానాలు ఆచరిస్తుంటారు.ఇక గనాగపూర్‌కు హైదరాబాద్ నుంచి వెళ్లాలంటే గుల్బర్గా వరకు ముందుగా వెళ్లాల్సి ఉంటుంది. గుల్బర్గాకు 5 నుంచి 6 గంటల సమయం పడుతుంది. కేఎస్ఆర్టీసీ, టీఎస్ఆర్టీసీ బస్సులను నడుపుతున్నారు. గుల్బర్గా చేరుకున్నాక అక్కడి నుంచి గనాగపూర్‌కు వెళ్లాల్సి ఉంటుంది. హైదరాబాద్ నుంచి గుల్బర్గాకు రైలు మార్గంలోనూ వెళ్లవచ్చు. బెంగళూరు చేరుకుని అక్కడి నుంచి కూడా గనాగపూర్‌కు వెళ్లవచ్చు. ఇక ఈ ఆలయంలో నిత్యం అనేక పూజలు, అభిషేకాలు జరుగుతుంటాయి. ప్రత్యేక సేవలను కూడా నిర్వహిస్తుంటారు. కనుక సేవ వివరాలను తెలుసుకుని వెళితే స్వామి వారిని సులభంగా దర్శించుకోవచ్చు.

# ఏపీకి మరో వాయు'గండం'.. ముంచుకొస్తోన్న మరో ముప్పు



అమరావతి : ఇప్పుడిప్పుడే ఓ వాయుగుండం సృష్టించిన వర్షాల నుంచి కోరుకుంటున్న ఏపీకి .. మరో వాయుగుండం ముప్పు తప్పేలా కనిపించడం లేదు. ఆదివారం నాటికి ఉత్తర అండమాన్ సముద్రంలో ఒక ఉపరితల ఆవర్తనం ఏర్పడనుంది.దాని ప్రభావంతో ఈ నెల 22 నాటికి బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడుతుందని వాతావరణ శాఖ ప్రకటించింది. అయితే అల్పపీడనం పశ్చిమ వాయువ్య దిశగా కదులుతూ మరింత బలపడి.. వాయుగుండంగా మారుతుందని తాజా బులెటిన్‌లో భారత వాతావరణ శాఖ ప్రకటించింది. అయితే ఈ వాయుగుండం ఏపీ నుంచి పశ్చిమ బెంగాల్ మధ్య ఎక్కడైనా తీరం దాటే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. అల్పపీడనం ఏర్పడిన తర్వాత%% తీరం ఎక్కడ దాటుతుందనే విషయంపై అధికారికంగా స్పష్టత వస్తుంది.బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిన తర్వాత రెండు రోజులకు ఉత్తరకొస్తా జిల్లాలో వర్షాలు కురిసే అవకాశం ఉంది. అంతే ఈనెల ఈ నెల 24వ తేదీ తర్వాత ఉత్తర కోస్తా జిల్లాల్లో భారీ వర్షాలకు అవకాశముంది. రాగల రెండు మూడు రోజుల్లో ఏపీలో కొన్ని జిల్లాల్లో తెలియని నుంచి మోస్తారు వర్షాలు కురుస్తాయని ప్రకటించింది ఐఎండి.ఇక 19 అక్టోబర్, శనివారం విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీ సత్యసాయి, వైఎస్ఆర్, అన్నమయ్య, చిత్తూరు మరియు తిరుపతి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది.విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, కృష్ణా, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది.

# అవయవ దాత గుండె తీస్తుండగా ఊహించని ఘటన



అమరావతి : ఎవరైనా కొనప్రాణంతో ఉన్నా.. కోమాలో ఉన్నా.. ఇక బతకడేమోనని కుటుంబ సభ్యులు అవయవ దానం చేస్తుంటారు. ఇలా ఏదో ఒక చోటు జరుగుతూనే ఉంటాయి. అయితే అమెరికాలో ఇలాంటి ఘటనే చోటుచేసుకుంది.అయితే వైద్యులు ఆపరేషన్ థియేటర్‌కు తీసుకెళ్లి పరిశీలిస్తుండగా పేషెంట్ సడన్ షాకిచ్చాడు. అతడు బతికే ఉన్నాడని గుర్తించి డాక్టర్లు షాక్‌అయ్యారు.అమెరికాకు చెందిన థామస్ టీజే హూకర్‌కు డ్రగ్ ఓవర్‌డోస్ వల్ల గుండె ఆగిపోయింది. కెంటకీలోని ఓ ఆసుపత్రి వైద్యులు పరిశీలించి బ్రెయిన్ డెడ్‌గా ప్రకటించారు. దీంతో అతడి అవయవాలు దానం చేసేందుకు కుటుంబీకులు అంగీకరించారు. ఈ క్రమంలో అవయవాల పనితీరును నిర్ధారించుకునేందుకు వైద్యులు సిద్ధమయ్యారు. ఆపరేషన్ థియేటర్‌లోకి తీసుకెళ్తున్న క్రమంలో బాధితుడిలో కదలికలు కనిపించాయి. థియేటర్ లోనికి వెళ్లే సరికి అతడి కళ్ల నుంచి నీరు కారడం, చేతులను తడుముతున్నట్లు గమనించిన వైద్య సిబ్బంది ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. దీంతో అక్కడున్న ఇద్దరు వైద్యులు అవయవాలను తొలగించేందుకు నిరాకరించినట్లు సహాయకురాలిగా ఉన్న వ్యక్తి వెల్లడించారు. అయినప్పటికీ ఆపరేషన్ చేసేందుకు వైద్యులు ప్రయత్నించారనే ఆరోపణలు వచ్చాయి. కుటుంబ సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేయడంతో చివరకు అవయవాల తొలగింపు ప్రక్రియ నిలిపివేశారు.ఇదిలా ఉంటే హూకర్ ప్రస్తుతం ఆరోగ్యంగానే ఉన్నాడు. కొన్ని రోజుల తర్వాత కోలుకుని క్షేమంగా ఉన్నాడు. కొన్ని సమస్యలు మినహా ఆరోగ్యంగానే ఉన్నాడు. అయితే సజీవంగా ఉన్న వ్యక్తి అవయవాలు సేకరించేందుకు సిద్ధమయ్యామని వచ్చిన ఆరోపణలను కేఓడీఏ అధికారులు తోసిపుచ్చారు. దీనిపై ఆ రాష్ట్ర వైద్యశాఖ దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు అమెరికన్ మీడియా తాజాగా వెల్లడించింది.

# ఇంత టాలెంటెడ్‌గా ఉంటే జాబ్ ఇవ్వము! యువతికి షాకిచ్చిన గూగుల్!




న్యూఢిల్లీ : ఎవరికైనా ఉద్యోగం దొరకలేదంటే టాలెంట్ తక్కువై ఉంటుందనో లేదా పోటీ ఎక్కువగా ఉందనో అనుకుంటాం. కానీ ఓ యువతికి టాలెంట్ ఎక్కువ కావడంతో ఉద్యోగం దక్కలేదు.గూగుల్‌లో జాబ్‌కు దరఖాస్తు చేసుకున్న ఓ యువతికి ఎదురైన వింత అనుభవం ఇది. టాలెంట్ ఎక్కువైనందుకే జాబ్ ఇవ్వలేకపోతున్నామంటూ గూగుల్ పంపించిన లేఖను కూడా మహిళ షేర్ చేసింది. ఈ ఉదంతం ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారింది.అనుష్క శర్మ అనే యువతి తనకెదురైన వింత అనుభవాన్ని తాజాగా నెట్టింట పంచుకుంది. ఇటీవల ఆమె గూగుల్‌లో ఓ ఉద్యోగానికి దరఖాస్తు చేసుకుంది. అయితే, ప్రస్తుతం ఆమె చేస్తున్న జాబ్‌కు ఇది భిన్నమైనది. ప్రస్తుత ఉద్యోగంతో పోలిస్తే తక్కవ నైపుణ్యాలు అవసరమయ్యే జాబ్ ఇది. అయితే, యువతి మాత్రం రెజ్యూమేలో తన స్కిల్స్, అనుభవం గురించి యథాతథంగా పేర్కొంది.యువతి దరఖాస్తును పరిశీలించిన గూగుల్.. ఆమెకు జాబ్ ఇవ్వలేమంటూ సందేశం పంపించింది. అయితే, అందులో పేర్కొన్న కారణాలు చదవిని యువతికి దిమ్మతిరిగినంత పనైంది. "మీ రెజ్యూమేను పరిశీలించాము. ఈ జాబ్‌కు అవసరమైన వాటికంటే మీకు ఎక్కువ నైపుణ్యాలు ఉన్నట్టు మాకు అనిపించింది. తమ అర్హతకు దిగువన ఉన్న ఉద్యోగాల్లో అభ్యర్థులు అసంతృప్తిలోనైన త్వరగా రాజీనామా చేయడం మేము గతంలో చాలా సార్లు చూశాము. కాబట్టి, ఈ జాబ్ ఇవ్వలేకపోతున్నాము" అని చెప్పింది.ఈ సందేశం తాలూకు వీడియోను నెట్టింట షేర్ చేసిన అనుష్క.. ఆశ్చర్యం వ్యక్తం చేసింది. టాలెంట్ ఎక్కువైనందుకు జాబ్ లభించని ఘటనలు కూడా ఉంటాయని నాకు తెలీదు" అని ఆమె ట్వీట్ చేసింది.ఇక సహజంగానే ఈ ఉదంతంపై నెట్టింట పెద్ద ఎత్తున స్పందన వచ్చింది. అనేక మంది ఆశ్చర్యం వ్యక్తం చేశారు. కొందరు సెటైర్లు పేల్చారు. అయితే, జాబ్ తిరస్కరణకు గురికావడం దైవఘటనగా భావించాలని ఓ వ్యక్తి అన్నాడు. ఈ అనుభవంతో సొంత సంస్థ స్థాపించుకుని వృద్ధిలోకి రావాలని సూచించాడు. ఇలా రకరకాల కామెంట్స్ మధ్య వీడియో తెగ వైరల్ అవుతోంది.

# ఏనుగుల గుంపును ఢీ కొట్టి పట్టాలు తప్పిన రైలు.. లక్షల లీటర్ల పెట్రోల్ నేలపాలు ..

న్యూఢిల్లీ : లక్షల లీటర్ల పెట్రోల్‌తో వెళ్తున్న ఓ రైలు భారీ ప్రమాదానికి గురైంది. కొలంబో నుంచి బట్టికలోవాకు వెళ్తున్న రైలు మిన్నేరియా రైల్వే స్టేషన్ సమీపంలోకి రాగానే ప్రమాదానికి గురైంది.అప్పటికే పట్టాలపై ఉన్న ఏనుగుల గుంపును చూసిన లోకోపైలట్ సడన్ బ్రేకులు వేశారు. దాంతో రైలు నాలుగు బోగీలు పట్టాలు తప్పాయి. రెండు బోగీల్లో పెట్రోల్ పూర్తిగా లీకై నేలపాలైంది. మిగతా బోగీల నుంచి ఇంధనాన్ని తొలగించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదంలో రెండు ఏనుగులు చనిపోగా, మిగతా వాటికి గాయాలైనట్టుగా తెలిసింది. ఈ ఘటన శ్రీలంకలోని ఉత్తర మధ్య ప్రావిన్స్‌లో జరిగింది.శ్రీలంకలోని ఉత్తర మధ్య ప్రావిన్స్‌లో ఇంధనం రవాణా చేస్తున్న రైలు ట్రాక్‌పై అడవి ఏనుగుల గుంపును ఢీకొనడంతో పట్టాలు తప్పినట్లు రైల్వే శాఖ శుక్రవారం నివేదించింది. స్థానిక కాలమానం ప్రకారం శుక్రవారం తెల్లవారుజామున 3:30 గంటలకు రైలు కొలంబోలోని కొలోన్నావా పెట్రోలియం స్టోరేజీ టెర్మినల్ నుండి తూర్పు ప్రావిన్స్‌లోని బట్టికలోవాకు వెళ్తుండగా

ఈ ప్రమాదం జరిగిందని తెలిసింది. సడెన్‌గా బ్రేక్‌లు వేయటం, ఏనుగులను ఢీకొనడంతో నాలుగు ఇంధన ట్యాంకర్లు పట్టాలు తప్పాయని, దీంతో రైల్వే ట్రాక్‌లకు తీవ్ర నష్టం వాటిల్లిందని రైల్వే శాఖ తెలిపింది.ఈ ప్రమాదంలో రెండు ఏనుగులు మృతి చెందగా, మరికొన్ని ఏనుగులు తీవ్రంగా గాయపడ్డాయని స్థానిక మీడియా పేర్కొంది. ప్రమాదం కారణంగా కొలంబో–బట్టికలోవా ప్రధాన మార్గంలో రైలు సేవలు తాత్కాలికంగా నిలిపివేయబడ్డాయి.

# భారత్‌ని తక్కువ అంచనా వేయొద్దు!



న్యూఢిల్లీ : కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో ప్రవర్తనా తీరు భారతదేశంతో కెనడా దేశ దౌత్య సంబంధాలను పూర్తిగా దిగజార్చిందని చెబితే సత్య దూరం కాదేమో! ఆ తీరును పరిశీలిస్తే- అమెరికా నిఘా విభాగం సిఐఏ ఆడిస్తున్న ఆటలో ఆయన ఆట బొమ్మగా మారినట్లు స్పష్టం అవుతుంది.ఖలిస్తాన్ ఏర్పాటు వాది హర్దీప్ సింగ్ నిజ్జర్‌ను 2023 జూన్ 18లో కెనడాలోని టొరంటో నగరంలో ఎవరో హత్య చేశారు. ఈ హత్య భారత ప్రభుత్వ ప్రమేయంతో జరిగిందని నిరాధార ఆరోపణలను జస్టిన్ ట్రూడో అంతర్జాతీయ మీడియా ముందు ప్రకటించడం అసాధారణ విషయం. ఆయన ప్రకటనపై అమెరికా సపోర్టుగా మాట్లాడం పలు అనుమానాలకు దారితీసింది.భారతదేశంలో జాతీయవాద ప్రభుత్వం కేంద్రంలో అధికారంలో ఉండడం అమెరికా ప్రభుత్వానికి కంటగింపుగా మారింది. మోడీ ప్రభు త్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి భారతదేశంలోని ఎన్జీవోల ద్వారా దుష్ప్రచారాన్ని అమెరికా ప్రభుత్వ సంస్థలు, మోడీ వ్యతిరేక ప్రతిపక్షాలు కొనసాగిస్తూనే ఉన్నాయి. తెరచాటుగా అమెరికా చేసే ప్రయత్నాలను మోడీ ప్రభుత్వంలోని వ్యూహకర్తలు పటాపంచలు చేయడం అమెరికా ప్రభుత్వానికి, భారతదేశానికి వ్యతిరేకంగా పనిచేసే ఎన్జీవోలకు మింగుడు పడని విషయం. భారతదేశంలో రైతు ఉద్యమానికి మద్దతుగా సిక్కు ఏర్పాటు వాద సంస్థలు, జార్జ్ సోరోస్ ద్వారా నడపబడే అంతర్జాతీయ ఎన్జీవోలు నిలిచిన విషయం దేశ ప్రజలకు తెలుసు.

### కెనడా సిక్కుల వలలో ట్రూడో

కెనడాలో ట్రూడో ప్రభుత్వ మనుగడకు సిక్కు ప్రజలు, ప్రతినిధుల మద్దతు చాలా అవసరం. ప్రపంచంలో అత్యధికంగా సిక్కులు ఉండే దేశం కెనడా. ఆ దేశంలో ఎవరు ప్రభుత్వం అధికారంలో ఉండాలన్నా అక్కడ నివసిస్తున్న సిక్కుల మద్దతు చాలా అవసరం. రైతు ఉద్యమం వెనుక సిక్కు ఏర్పాటు వాద శక్తులు బలంగా పనిచేస్తున్నాయనేది వాస్తవం. రైతు ఉద్యమం ముసు గులో 2022 రిపబ్లిక్ డే రోజు ఎర్రకోటపై ఖలి స్తాన్ జెండా ఎగరవేయడం, 62 మంది పోలీసు ల తలలు పగలగొట్టడం ఈ శక్తుల పనే. దీనిని దృష్టిలో ఉంచుకొని, కెనడా ప్రధాని రైతు ఉద్యమకారులకు మద్దతుగా మాట్లాడడం భారత అంతర్గత వ్యవహారాలలో వేలు పెట్టడమే!

### ఎన్డీఏ ప్రభుత్వాన్ని తేలిగ్గా చూస్తే..

వాస్తవంగా అమెరికా ప్రభుత్వం, ఆ ప్రభుత్వం చేత ఆడించబడుతున్న కెనడా ప్రధాని ట్రూడో భారతదేశాన్ని పరిపాలిస్తున్న ఎన్డీఏ ప్రభుత్వాన్ని తక్కువ అంచనా వేయడం పెద్ద తప్పిదం. ఈ తప్పిదంలో భాగంగానే నిజ్జర్ హత్యపై భారత దేశానికి వ్యతిరేకంగా మాట్లాడటం, ఇటీవల ఆరుగురు భారత దౌత్య అధికారులను బహిష్కరించడం. అమెరికా ప్రభుత్వం జస్టిన్ ట్రూడోను భారతదేశానికి వ్యతిరేకంగా నిలపడం, బంగ్లా దేశ్ హసీనా ప్రభుత్వాన్ని కూల్చడానికి సహకరించడం, అక్కడ మత ఛాందసవాదులతో చేతు లు కలిపి, హిందువులపై దాడులు చేయించడం వెనుక ఆ దేశ ప్రయోజనాలు చాలా ఉన్నాయి. అమెరికా ప్రభుత్వం ఆయిల్ లాబీయింగ్‌ను మోడీ ప్రభుత్వం తృణీకరించడం, రష్యా, ఉక్రెయిన్ యుద్ధ పరిస్థితిని భారతదేశానికి అనుకూలంగా మలచుకుని, అమెరికన్ డాలర్ స్థానంలో భారత్ రూపాయి మారకంతో రష్యా నుండి క్రూడ్ ఆయిల్ దిగుమతి చేసుకోవడం భారతదేశ ఆర్థిక అభివృద్ధికి పరిపుష్టిని కలిగించే విషయమే. ఈ విషయంలో మోడీ ప్రభుత్వం చేసిన కృషిని మోడీ వ్యతిరేక రాజకీయ పక్షాలు, ఆయనకు వ్యతిరేకంగా పనిచేసే మీడియా, దేశ వ్యతిరేక ఎన్జీవోలు ఒప్పుకోవు. ఇందుకు అనేక కారణాలు ఉన్నాయి.

### ఈ చిలకపలుకుల లక్ష్యం ఏమిటి?

మోడీని వ్యతిరేకించే అన్ని శక్తుల అసలు లక్ష్యం భారతదేశంలో మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించ డం, అమెరికా అంతర్జాతీయ రాజకీయాలకు అనుకూలమైన ప్రభుత్వాన్ని ఢిల్లీలో ఏర్పాటు చేయడం. కాంగ్రెస్ నాయకుడైనా రాహుల్ గాం ధీని అమెరికాకు రప్పించడం, భారతదేశంలో మైనారిటీల జీవించే హక్కులను మోడీ ప్రభు త్వం కాలరాస్తుందని, సిక్కు ప్రజలు తలపాగాను, చేతికి కడియాన్ని ధరించడానికి కూడా భారతదేశంలో హక్కు లేదని, భారత ప్రభుత్వ సంస్థలు ప్రజాస్వామ్యయుతంగా నడవడం లేదని అంతర్జాతీయ మీడియా ముందు చిలుక పలుకులు పలికించడం అమెరికా ప్రభుత్వం పనే. ఈ దేశం నాది, ఈ దేశానికి నేను వారసున్ని అనే భావన ఉన్న జాతి హితైషులందరికీ అమెరికా కుట్రపూరిత ఆలోచనలు బాగా తెలుసు! ఇక ఓటును అమ్ముకునే ఓటర్లకు మాత్రం ఈ విషయంలో ఎలాంటి ఎరుక లేదు.

# "బీజేపీ ముస్లింలకు శత్రువు కాదు.. విశ్వసించండి".. అబ్బాస్ కీలక వ్యాఖ్యలు



న్యూఢిల్లీ : కేంద్ర మాజీ మంత్రి, భారతీయ జనతా పార్టీ నాయకుడు ముఖ్తార్ అబ్బాస్ నఖ్వీ ముస్లింలకు పెద్ద విజ్ఞప్తి చేశారు. బీజేపీని విశ్వసించాలని శుక్రవారం నఖ్వీ ముస్లిం సమాజాన్ని కోరారు.రాంపూర్‌లో బీజేపీ "యాక్టివ్ మెంబర్‌షిప్ క్యాంపెయిన్" కింద నఖ్వీ తన క్రియాశీల సభ్యత్వాన్ని పునరుద్ధరించారు. కార్యకర్తలందరూ ఈ ప్రచారంలో చురుకైన సభ్యులుగా పాల్గొని సంస్థను అట్టడుగు స్థాయిలో బలోపేతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

### భద్రత, సామరస్యంతో నిండిన సమాజం ఒక బాధ్యత – నఖ్వీ

ఈ రోజు మోడీ–యోగి ప్రభుత్వ ప్రాధాన్యత తిరుగుబాటుదారులు, బలవంతుల భద్రత, రక్షణ కాదని.. సమాజ భద్రత, సామరస్యమేనని బీజేపీ నాయకుడు ముఖ్తార్ అబ్బాస్ నఖ్వీ అన్నారు. అల్లర్లు, రౌడీలు, అల్లర్లు, హింస లేని సమాజ నిర్మాణానికి బీజేపీ కృషి చేస్తోందన్నారు.

### విశ్వాసంలో లోపం చట్టవిరుద్ధం – నఖ్వీ

ముక్తార్ అబ్బాస్ నఖ్వీ ముస్లిం సమాజాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రసంగిస్తూ.. బీజేపీ పట్ల అలెర్జీ ఉన్న, బీజేపీ ప్రత్యర్థులైన కొంతమంది తప్పుదారి పట్టించే వ్యక్తులు మమ్మల్ని తప్పుపట్టిస్తున్నారని చెప్పారు. బీజేపీ లక్ష్యం అభివృద్ధి అని కొనియాడారు. భూస్వామ్య రాజకీయ నేతల మతపరమైన కుట్ర పట్ల మనం జాగ్రత్తగా ఉండాలని నఖ్వీ సూచించారు.అల్లర్లు, తిరుగుబాటుదారులను ఓడించడంలోనే సమాజానికి సామరస్యం, భద్రత ఉందని అన్నారు. ముస్లింలకు బీజేపీ పట్ల ఎలర్జీ ఉండకూడదని మరోసారి పునరుద్ఘాటించారు.

# రాతి చేపకు జీవం వస్తే కలియుగం అంతమే.. ఎక్కడో తెలుసా?



అమరావతి : అన్నమయ్య జిల్లా నందలూరు మండల కేంద్రంలో సౌమ్యనాథస్వామి దేవాలయం ఉంది. 11వ శతాబ్దానికి చెందిన ఈ పురాతన దేవాలయం 10 ఎకరాల విస్తీర్ణం కలిగి 108 స్తంభాలతో నిర్మించబడింది.ఈ దేవాలయంలో 108 ప్రదక్షిణలు చేసి స్వామి వారిని మొక్కుకుంటే కోరిన కోర్కెలు తీరుస్తాడని భక్తుల విశ్వాసం. సౌమ్యనాథ స్వామి ఆలయానికి విశేష చరిత్ర ఉంది. ఈ ఆలయం స్థానిక ఇతిహాసాలు మరియు ఈ ప్రాంతంలోని ఆధ్యాత్మిక సంప్రదాయాలతో ముడిపడి ఉంది. ఆలయ వాస్తుకళకు ఆదరణ పొందిన చోళ రాజవంశ పాలనలో ఈ ఆలయం నిర్మించబడిందని నమ్ముతారు. శతాబ్దాలుగా ఈ ఆలయం విష్ణు భక్తులకు అతి ముఖ్యమైన ప్రదేశం. స్వౌమ్యనాథస్వామి ఆలయ నిర్మాణమే ఒక అద్భుతం సౌమ్యనాథుని గర్భగుడిలో ఎలాంటి దీపం లేకపోయినా మూలవిరాట్టు ఉదయం నుండి సాయంత్రం వరకు దేదీప్యమానంగా వెలుగొందే విధంగా ఆలయ నిర్మాణం జరగడం ఇక్కడ ప్రత్యేకత. ఆలయంలో కొన్ని శాసనాలపై సూర్య చంద్ర చిహ్నాలు ఉన్నాయి. ఆలయ కుడ్యాలపై మత్స్య, సింహ తదితర చిహ్నాలు ఉన్నాయి. ఆలయంలోని శిల్ప కలలకు ఎంతో పురాతన చరిత్ర దాగి ఉంది. అంతే కాదు కలియుగం అంతానికి చేపకు సంబంధం కూడా ఉందంటారు.యుగాంతం గురించి బ్రహ్మంగారు కాలజ్ఞానంలో తెలుపుతూ వచ్చారు. మరి కొన్ని పురాణాలూ యుగాంతం గురించి చెబుతూనే వచ్చాయి. ఐతే యుగంతాం గురించి సౌమ్యనాథ స్వామి ఆలయంలోని చేప కూడా చెబుతుంది. స్వామివారి ఆలయంలో అంతర్ భాగంలో పైన ఒక రాతిపై చేప ఆకారాన్ని శిల్పంగా చెక్కారు. అక్కడ మత్స్య ఆకారాన్ని చెక్కడానికి పెద్ద చరిత్ర ఉంది. అక్కడి వేద పండితులు చెప్పే విషయాల ప్రకారం భవిష్యత్తులో భారీ వరదలతో ఈ ఆలయంలో లోపలికి నీరు చేరుకుంటుందని, ఆ నీరు ఈ చేపని తాకిన వెంటనే ఆ చేపకి ప్రాణం వచ్చి నీటిలో ఈదుతుందని పురాణాలు చెబుతున్నాయని వేదపండితులు అంటున్నారు. అప్పుడు ఈ కలియుగం అంతం అవుతుందని స్థల పురాణం చెప్తోందని అంటున్నారు. ఇంతకీ చేపకు జీవం వస్తుందా కలియుగం అంతం అవుతుందా అనేది శాస్త్రీయం. ఇది ఏమైనా కలియుగ అంతంపై అనేక పురాణాలు ఉన్నాయి అందులో ఇది ఒకటి.

రాయల్ జర్నలిజం
ద్విభాషా దినపత్రిక ROYAL JOURNALISM

# ఏపీలో మరో కొత్త పథకం అమలు, ముస్లింలకు పెద్ద పీట వేసిన చంద్రబాబు..



అమరావతి : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కొత్త పథకం తీసుకొచ్చింది, ఇది ముస్లిం మైనారిటీ విద్యార్థుల ప్రయోజనం కోసం రూపొందించబడింది. రాష్ట్రవ్యాప్తంగా ఉర్దూ మాధ్యమ పాఠశాలల్లో ఉర్దూ భాషా ఉపాధ్యాయులు మరియు వాలంటీర్లు అందుబాటులోకి రానున్నారు. ఈ ప్రక్రియలో విద్యా వాలంటీర్ల నియామకానికి 'చంద్రన్న మదర్సా నవీన విద్యా పథకం' పేరుతో ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించారు. దీని కోసం ప్రభుత్వం అవసరమైన చర్యలు చేపడుతుంది. మైనారిటీ సంక్షేమశాఖ మంత్రి ఫరూక్ ఇప్పటికే విద్యావాలంటీర్ల నియామకానికి ఆమోదం ఇచ్చారు. రాష్ట్రంలో 185 మదర్సాలు ఉన్నట్లు సమాచారం, ప్రతి మదర్సాలో ముగ్గురు చొప్పున మొత్తం 555 విద్యావాలంటీర్ల నియామకానికి ప్రతిపాదనలు తయారు అయ్యాయి. 'చంద్రన్న మదర్సా నవీన విద్యా పథకం' అమలు కోసం ఏడాదికి 13 కోట్లు ఖర్చు అవుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ పథకానికి ఆర్థికశాఖ నుంచి ఆమోదం వచ్చే దిశగా చర్యలు తీసుకోవాల్సి ఉంది. కేంద్ర ప్రభుత్వం గతేడాది నూతన విద్యా విధానాన్ని అమలు చేస్తూ, దక్షిణాది రాష్ట్రాల్లో ఉర్దూ భాషను ప్రోత్సహించేందుకు అనుమతి ఇచ్చింది. ఈ ప్రక్రియలో, ప్రతి తరగతిలో కనీసం 15 మంది విద్యార్థులు ఉండాలి, మరియు ఉర్దూ మాధ్యమ పాఠశాలల్లో గౌరవ వేతనం కింద ఉర్దూ భాషా ఉపాధ్యాయుల నియామకానికి కేంద్రం నిధులు కేటాయిస్తోంది. అయితే, గత ప్రభుత్వ కాలంలో ఈ పథకాన్ని వినియోగించకపోవడంతో, కూటమి ప్రభుత్వం దీనికి సంబంధించి నిబంధనలను పాటిస్తూ కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది. ఏపీలో మొత్తం 1,600 ఉర్దూ మాధ్యమ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 238 పాఠశాలల్లో ప్రతి తరగతిలో 15 మంది కంటే ఎక్కువ విద్యార్థులు ఉన్నట్లు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి నివేదించింది. దీంతో, ఒక్కో ఉపాధ్యాయుడికి నెలకు 30 వేలు గౌరవవేతనం చెల్లించేందుకు 10 కోట్ల రూపాయలను కేంద్రం విడుదల చేసింది. రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన వెంటనే, అధికారులు నియామక ప్రక్రియను ప్రారంభించడానికి సిద్ధమవుతున్నారు. 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వం మదర్సాల్లో విద్యార్థులకు నవీన విద్యను అందించేందుకు విద్యా వాలంటీర్ల నియామకాన్ని ప్రారంభించింది. అయితే, 2019లో అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం ఈ విధానాన్ని కొనసాగించలేదు. ప్రస్తుతం, ఏపీలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం మదర్సాల్లో విద్యావాలంటీర్ల నియామకానికి కసరత్తు చేస్తోంది, త్వరలోనే ఈ నియామక ప్రక్రియను పూర్తిచేయనుంది. ఈ నిర్ణయంపై మైనార్టీ సమాజం హర్షం వ్యక్తం చేసింది.

# కృష్ణా నదికి కొనసాగుతున్న వరద



గుంటూరు : కృష్ణానదికి వరద కొనసాగుతోంది. శుక్రవారం నాగార్జున సాగర్ నుంచి 1,08,507 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. శ్రీశైలం జలాశయం నుంచి 1,06,805 క్యూసెక్కులు దిగువకు విడుదల చేయగా సాగర్‌కు 1,08,505 క్యూసెక్కుల వచ్చి చేరుతోంది. దీంతో సాగర్ నుంచి దిగువకు వచ్చిన నీటిని వచ్చినట్టుగా విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి నీటి విడుదల పెరగడంతో పులిచింతల, ప్రకాశం బ్యారేజికి కూడా వరద పోటు పెరిగింది. ప్రకాశం బ్యారేజి నుంచి దాదాపు 64 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో పులిచింతల, ప్రకాశం బ్యారేజి దిగువన ఉన్న రీచ్‌ల నుంచి ఇసుక తీయడం కష్టంగా మారింది. గత నెలలో లింగాయపాలెం, తాళ్లాయపాలెం, గుండిమెడ తదితర రీచ్‌ల వద్ద ఇసుక విక్రయాలకు స్టాక్ పాయింట్‌లను ఏర్పాటు చేయగా వరదకు ఇసుక నదిలోకి కొట్టుకుపోయింది. ఈ పరిస్థితులలో వరద కొనసాగుతుండటం వల్ల ఇసుక తవ్వకాలు ముందుకు సాగడం లేదు. గుండిమెడ, బొమ్మువానిపాలెం, మున్నంగిలో ఇసుక తవ్వకాలకు టెండర్లు ఖరారు చేశారు. పల్నాడు జిల్లాలో అచ్చంపేట, అమరావతి మండలాల్లో కూడా పలు రీచ్‌లకు టెండర్లు ఖరారు చేయగా వరద ప్రభావం నుంచి నదీగర్భం నుంచి ఇసుక బయటకు తీయడం ఇబ్బందిగా మారిందని చెబుతున్నారు. దీంతో జిల్లాలో ఈనెల 16 కల్లా ఇసుక పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలన్న లక్ష్యం నెరవేరలేదు. గత నెల రోజులుగా ఇసుక దొరక్క ఉమ్మడి జిల్లాలో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకున్న వారికి ఇసుక ఇస్తామన్న ప్రభుత్వ హామీ ఫార్సుగా మారింది. ఆన్‌లైన్ బుకింగ్ అందని ద్రాక్షగా మిగిలింది. ఇసుక లేకపోవడంతో నిర్మాణం రంగంలో ఉపాధికి గండిపడింది. వేలాది మంది కార్మికులకు పనులులేక అల్లాడుతున్నారు. ఈ నేపథ్యంలో ట్రాక్టర్లు, ఎడ్లబండ్ల ద్వారా నేరుగా నదీ పరివాహక ప్రాంతాల నుంచి ఇసుక తీసుకునేందుకు అనుమతిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఉచిత ఇసుక విధానంలో మార్పులు చేస్తూ ప్రభుత్వం సవరణ ఉత్తర్వులు జారీచేసింది. స్థానిక అవసరాలకు గతంలో రీచ్‌ల నుంచి ఇసుక తీసుకెళ్లేందుకు ఎడ్లబండ్లకు మాత్రమే అనుమతివ్వకగా తాజాగా ట్రాక్టర్ల ద్వారా తీసుకువెళ్లేందుకూ అనుమతిచ్చింది.

**టైల్‌పాండ్ ప్రాజెక్టుకు భారీగా నీరు**

మండలంలోని సత్రశాల వద్ద కృష్ణానదిపై నిర్మితమైన నాగార్జునసాగర్ టైల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టుకు ఎగువనున్న నాగార్జునసాగర్ నుంచి 75 వేల క్యూసెక్కుల వరద నీరు వస్తున్నట్లు ఎస్ఇ వెంకటేశ్వరరావు శుక్రవారం తెలిపారు. ప్రాజెక్టుకు చెందిన నాలుగు గేట్లను రెండు మీటర్లు రెండు క్రస్ట్ గేట్లను 1.5 మీటర్లుఎత్తి 69,000 క్యూసెక్కులు నీరు విడుదల చేస్తూ రెండు యూనిట్లు ద్వారా విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తూన్నారు. అనంతరం టైల్‌రైస్ ఛానల్ ద్వారా 8,420 క్యూసెక్కులను మొత్తంగా 77,420 క్యూసెక్కులను పులిచింతలకు విడుదల చేస్తున్నారు. గురువారం అర్ధరాత్రి 12 గంటల వరకు 1.07 ఎంయు (మిలియన్ యూనిట్ల)ల విద్యుత్ తయారైందన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్లో 75.50 మీటర్ల మేర నీరు నిల్వ ఉంది. ఇది 7.080 (పూర్తిస్థాయి) టీఎంసీలకు సమానం.

# కొత్త తరహా సైబర్ స్కామ్.. ఖాళీ అవుతున్న ఖాతాలు



చెన్నై: సైబర్ నేరగాళ్లు డబ్బులు కొల్లగొట్టేందుకు ఎన్నో ఎత్తులు వేస్తున్నారు. ముందుగానే విద్యార్థులకు సంబంధించిన సమగ్ర సమాచారం సేకరిస్తున్నారు. ఇందులో విద్యార్థి పేరు, పాఠశాల, చిరునామా, తల్లిదండ్రుల పేర్లు, ఇతర వివరాలుంటున్నాయి. విద్యార్థుల తల్లిదండ్రులకు సంబంధించిన ఫోన్ నెంబర్లు కూడా వారికి తెలిసిపోతున్నాయి. వాటిసాయంతో ఫోన్ చేసి పిల్లల వివరాలన్నీ తల్లిదండ్రులకు చెబుతున్నారు. 'మీ అబ్బాయి/ అమ్మాయికి స్కాలర్‌షిప్ మంజూరైంది' అంటున్నారు. ఆ మాట వినగానే తల్లిదండ్రులు నిజమే అనుకుంటున్నారు. ఇలా వలలో పడి ఇతర వివరాలు చెప్పేస్తున్నారు. బ్యాంకు ఖాతాకు అనుసంధానమైన నెంబరు అడగటంతో పాటు ఆ నెంబరుపై ఉన్న యూపీఐ ఐడీ సైతం తీసుకుంటున్నారు.

**డబ్బులు వేసి లాగేసుకుంటూ..**

స్కాలర్‌షిప్ మంజూరైందని ఓ పక్క చెబుతూ, బ్యాంకు వివరాలు, యూపీఐ ఐడీ వివరాలు అడుగుతుండటంతో కొంతమంది తల్లిదండ్రులకు అనుమానమొచ్చింది. ఇలాంటివారు అప్రమత్తమై పోలీసుల్ని సంప్రదించారు. ఇంకొందరు తమ ఖాతాల్లో డబ్బులు పోగొట్టుకున్న తర్వాత సైబర్ పోలీసులను ఆశ్రయిస్తున్నారు. ఇలా రాష్ట్రవ్యాప్తంగా చాలామంది బాధితులు ఉన్నట్లు అంచనాలు తెలుస్తోంది. అందిన ఫిర్యాదుల మేరకు ఒక్కో కుటుంబం రూ.5వేల నుంచి రూ.25వేల దాకా డబ్బులు పోగొట్టుకుంటున్నట్లు పేర్కొంటున్నారు. ఓ బాధితురాలు మాట్లాడుతూ.. తమ ఖాతాల్లో ఆ దుండగులు ముందు రూ.25 వేలు జమ చేశారని, ఇందుకు తామెంతో సంబరపడ్డామని చెప్పారు. ఆ తర్వాత వెంటనే రూ.25 వేలు వెనక్కి తీసుకోవడంతో పాటు తమ ఖాతాలో ఉన్న రూ.6వేలు కూడా విత్‌డ్రా చేసేశారని వాపోయారు. ఈ తరహా మోసాలు పలు జిల్లాల్లో బయటపడుతున్నాయి.

**వివరాలు ఇచ్చిందెవరు?**

విద్యార్థులకు సంబంధించిన వివరాలు ఎలా బయటికెళ్లాయనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఇదే విషయమై విచారణ చేపట్టారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల నుంచి కళాశాలలకు డాటా పంచుకునే సంస్కృతి ఉంది. తద్వారా ఉన్నత చదువులు చదివేందుకు తమ కాలేజీలో పిల్లలను చేర్పించాలంటూ తల్లిదండ్రులకు చాలా ఫోన్లు వస్తుంటాయి. ఇదే తరహాలోనే వివరాలు తీసుకున్నారా, మరో మార్గం ఎంచుకున్నారా అన్నది తేలాల్సి ఉంది. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం తమిళనాడు ఈ-గవర్నెన్స్ ఏజెన్సీ ద్వారా విద్యార్థుల ఆధార్‌కార్డును ఆయా పాఠశాలల్లోనే తీసుకుని తద్వారా స్కాలర్‌షిప్ ప్రక్రియ మొదలుపెట్టే విధానముంది.

**మరో రకంగా..**

సైబర్ నేరగాళ్లు విద్యార్థుల తల్లిదండ్రులను వాట్సాప్‌లోనూ సంప్రదిస్తున్నారు. విద్యార్థుల వివరాలు జతచేసి.. మీ కుమారుడు/ కుమార్తెకు స్కాలర్‌షిప్ మంజూరైందని చెబుతూ నకిలీ క్యూఆర్ కోడ్‌ను వారికి పంపుతున్నారు. స్కాన్ చేయగానే బ్యాంకు ఖాతా వివరాలు తీసుకుని మోసాలకు పాల్పడుతున్నారు.

**ఆ విద్యార్థులే లక్ష్యంగా..**

ప్రత్యేకించి సైబర్ నేరగాళ్లు కేవలం 10 నుంచి 12వ తరగతి చదివే విద్యార్థుల కుటుంబాలకు మాత్రమే ఫోన్లు చేస్తున్నారని సైబర్ పోలీసుల దర్యాప్తులో తేలింది. ప్రైవేటు పాఠశాలల్లో ఈ తరగతులకు సంబంధించి ఫీజులు ఎక్కువగా ఉండటం, స్కాలర్‌షిప్పుల కోసం తల్లిదండ్రులు ఆశపడుతుండటంలాంటి విషయాలు నేరగాళ్లకు కలిసొస్తున్నాయి.

**ఎక్కువగా తిరునెల్వేలిలో..**

ఈ స్కామ్‌లో ఎక్కువమంది బాధితులు తిరునెల్వేలి జిల్లా నుంచి ఉన్నారని అధికారులు గుర్తించారు. డబ్బులు పోగొట్టుకుని అధికారుల దృష్టికి వచ్చినవారే 10మందికి పైగా ఉన్నట్లు తెలుస్తోంది. తాజాగా 5మంది ఖాతాల నుంచి డబ్బులు మాయమవగా, ఆగస్టులో మరో 5మంది ఖాతాల నుంచి సైబర్ నేరగాళ్లు విత్‌డ్రా చేశారు. ఆ జిల్లాలో చాలామంది తల్లిదండ్రులకు ఈ తరహా స్కాలర్‌షిప్ కాల్స్ వచ్చినట్లుగా చెబుతున్నారు. కొందరు మాత్రం ముందే అప్రమత్తమైనట్లు వివరిస్తున్నారు.

**విద్యాశాఖ ఆదేశాలు**

స్కాలర్‌షిప్పుల స్కామ్‌పై పాఠశాల విద్యాశాఖ జిల్లాల్లో ముఖ్యవిద్యాధికారులకు కీలక ఆదేశాలు చేసింది. విద్యార్థులు, తల్లిదండ్రుల్లో అవగాహన కల్పించాలని చెబుతోంది. ఎలాంటి పరిస్థితుల్లోనూ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా జాగ్రత్తగా ఉండేలా అప్రమత్తం చేయాలని కోరింది. బాధితులకు అండగా నిలవాలని ఆదేశించింది. విద్యాశాఖ ఎప్పుడూ ఫోన్లలో బ్యాంకు ఖాతాల వివరాలు తీసుకోదని, పాఠశాలలోనే తీసుకుని స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేయిస్తారని, మోసపోవద్దని హెచ్చరిస్తున్నారు.

# గడ్డకట్టే చలిలో 17 గంటల నరకయాతన !




న్యూఢిల్లీ : ఎముకల కొరికే చలి..శరీరం గడ్డకట్టే మైనస్ డిగ్రీల ఉష్ణోగ్రత..సముద్ర మట్టానికి 12,000 అడుగుల ఎత్తయిన నిర్జన అటవీ ప్రాంతం. తినడానికి తిండి లేదు..సాయం కోసం 17 గంటలపాటు నిరీక్షణ. ప్రధాన ఎన్నికల కమిషనర్(సిఇసి) రాజీవ్ కుమార్‌కు ఎదురైన ఈ వింత అనుభవం కలకాలం గుర్తుండిపోతుంది. పితోరాగఢ్ ప్రాంతంలోని మారుమూల పోలింగ్ కేంద్రాలను సందర్శించేందుకు బుధవారం మధ్యాహ్నం సిఇసి రాజీవ్ కుమార్ హెలికాప్టర్‌లో బయల్దేరారు. ఆయన వెంట పైలట్, మరో ఇద్దరు ఉన్నారు. అయితే దట్టమైన మేఘాలు కమ్ముకుని ఉండడంతో హెలికాప్టర్‌ను రాలం గ్రామం వద్ద పైలట్ ఎమర్జెన్సీ ల్యాండింగ్ చేయాల్సి వచ్చింది. అది నిర్జన గ్రామం. అక్కడ నివసించే ప్రజలు శీతాకాలంలో వేరే ప్రాంతాలకు వలస వెళ్లిపోతారు. తిరిగి వేసవి కాలంలో తమ గ్రామానికి చేరుకుంటారు. ఇప్పటికే శీతాకాలం చలి తీవ్రత పెరిగిపోయిన కారణంగా గ్రామస్తులు గ్రామాన్ని వదిలిపెట్టి వెళ్లిపోయారు. అదనపు ప్రధాన ఎన్నికల అధికారి విజయ్ కుమార్ జోగ్‌దండే, హెలికాప్టర్ పైలట్, కుమార్ అనే ఉద్యోగితో కలసి సిఇసి అక్కడే ఒక పొలంలో సాయంత్రం ఐదు గంటల వరకు గడిపారు. ఇంతలో బెంగళూరుకు చెందిన ఇద్దరు ట్రెక్కర్లు వీరిని చూసి అక్కడకు వచ్చారు. తమ వద్ద ఉన్న ఇన్‌స్టంట్ నూడుల్స్, డ్రై ఫ్రూట్స్ సిఇసి బృందానికి ఇచ్చారు. ఎవరూ లేని ఒక ఇంటిని తెరచి చలిమంట వేసి ఆ ఇద్దరు ట్రెక్కర్లు వెళ్లిపోయారు. గడ్డకట్టే చలిలో ఉన్నిదుస్తులు ఏవీ లేకుండా గడపాల్సిన పరిస్థితి సిఇసి బృందానికి ఎదురైంది. అయితే తమ హెలికాప్టర్ ఎమర్జెన్సీ ల్యాండింగ్ చేసినట్లు సిఇసి బుధవారం మధ్యాహ్నం 1 గంటకే పితోరాగఢ్ జిల్లా మెజిస్ట్రేట్ వినోద్ గిరీష్‌కు సమాచారం అందచేశారు. దీంతో ఆయన మిలాం, లిలాంలోని ఐటిబిపి పోస్టులను అప్రమత్తం చేసి సిఇసి ఉన్న ప్రదేశానికి వెళ్లాలని ట్రూపర్లను ఆదేశించారు. ఇంతలో పరిసర ప్రాంతాలకు చెందిన గ్రామస్తులు రలాంలో హెలికాప్టర్ దిగినట్లు తెలుసుకున్నారు. పటో గ్రామ సర్పంచ్ ఈశ్వర్ సింగ్ నబియాల్ మరి కొందరితో కలసి 8 కిలోమీటర్లు నడుచుకుంటూ అర్ధరాత్రి ఒంటిగంటకు సిఇసి తలదాచుకున్న ఇంటిని చేరుకున్నారు. తమ వెంట తెచ్చిన డ్రైఫ్రూట్స్‌ను వారికి అందచేశారు. తెల్లవారుజామున 5 గంటలకు ఐటిబిపి బృందాలు కూడా అక్కడకు చేరుకున్నాయి. తమ వెంట తెచ్చిన మందులు, ఆహారాన్ని సిఇసి బృందానికి అందచేశాయి. వేడిగా తేనీరు అందచేశాయి. చివరకు ఉదయం 6 గంటల ప్రాంతంలో సిఇసి బృందం మున్సారీ బయల్దేరింది. అక్కడ ఐటిబిపి విశ్రాంతి గృహంలో కొద్ది సేపు గడిపి సిఇసి రాజీవ్ కుమార్ న్యూఢిల్లీ బయల్దేరారు. కాగా..అత్యవసర పరిస్థితిలో తమను ఆదుకున్న స్థానికులకు సిఇసి కృతజ్ఞతలు తెలిపారు. దేవభూమి ప్రజలు సహజసిద్ధంగానే ఆపద్బాంధవులని ఆయన కీర్తించారు.

# ఆరు కాస్తా.. ఇక్కడ రెండే..




అమరావతి : 16వ నంబరు జాతీయ రహదారిపై ఏలూరు ఆశ్రం కూడలి సమీపంలోని రైలు వంతెన పనులు అసంపూర్తిగా ఉన్నాయి. ఆరు లైన్ల విస్తరణ పనుల్లో భాగంగా ఇక్కడ మూడులైన్ల ఆర్వోబీ పనులు చేపట్టాల్సి ఉంది. అప్రోచ్ రహదారులను కొంత వరకూ వేసి పనులు నిలిపేశారు. దీంతో ఆరులైన్ల రహదారి ఇక్కడకొచ్చేసరికి రెండులైన్లకే పరిమితమైంది. జాతీయ రహదారిపై అత్యంత వేగంగా వస్తున్న వాహనాలు మలుపు దగ్గర నియంత్రించలేక తరచూ ప్రమాదాల బారిన పడుతున్నాయి. ప్రస్తుతం రైలు వంతెన శిథిలావస్థకు చేరింది. నీ దీనిపై విజయవాడ రీజియన్ ఎన్‌హెచ్ఏఐ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్వోబీ పనులకు దిల్లీ నుంచి అనుమతులు రావాల్సిఉందన్నారు. గుత్తేదారుతో మాట్లాడి నిర్వహణ పనులు చేయిస్తామన్నారు.

# ప్రయాణికులకు బిగ్ అలర్ట్.. సింహపురి ఎక్స్‌ప్రెస్ టైమ్ మార్పు



అమరావతి : ఏపీ, తెలంగాణ ప్రయాణికులకు దక్షిణ మధ్య రైల్వే అధికారులు బిగ్ అలర్ట్ ప్రకటించారు. సికింద్రాబాద్‌నుంచి గూడూరు వెళ్లాల్సిన సింహపురి ఎక్స్‌ప్రెస్ టైమ్ మార్పు చేస్తున్నట్లు ప్రకటించారు. రాత్రి 10.05 గంటలకు బయల్దేరాల్సిన రైలు శుక్రవారం రాత్రి 11.05 నిమిషాలకు కదులుతుందని తెలిపారు. గతంలోనూ ఈ రైలు రాత్రి 11.05 నిమిషాలకు సికింద్రాద్ నుంచి బయల్దేరి గూడూరు జంక్షన్‌కు ఉదయం 8.55 గంటలకు చేరుకునేదని చెప్పారు. తాజాగా కూడా పాత సమయానికే సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో సింహపూరి ఎక్స్ ప్రెస్ రైలు కదులుతుందన్నారు. సికింద్రాబాద్ నుంచి గూడూరు వెళ్లే సింహపూరి ఎక్స్ ప్రెస్ టైమ్ మాత్రమే మార్పు చేశామని చెప్పారు. గూడూరు-సికింద్రాబాద్ సింహపురి ఎక్స్‌ప్రెస్ సమయంలో ఎలాంటి మార్పు లేదని పేర్కొన్నారు. గూడూరులో సాయంత్రం 6.40కు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 5.40కు సికింద్రాబాద్ చేరుకుంటుందని అధికారులు తెలిపారు.

# సృష్టికి ప్రతిసృష్టి చేసేంతగా విజ్ఞానం.. అయినా వీణ-వాణిల పరిస్థితి ఇంతేనా..



అమరావతి : ఈ ఏడాది అక్టోబర్ 16న. 22వ వసంతంలోకి అడుగుపెట్టారు అవిభక్త కవలలు వీణ-వాణి. స్వగ్రామంలో ఆత్మీయుల మధ్య వీరి బర్త్‌డే వేడుకలు జరిగాయి. ఆ ఫోటోలు, వీడియోలు నెట్టింట తెగ వైరల్ అయ్యాయి. అయితే వీణావాణికి శాప విమోచనం జరిగితే బావుంటుందని మనసున్న ప్రతీ ఒక్కరూ కోరుకున్నారు. ఆ ఇద్దరూ అనుకోలేదుగానీ దైనందిన జీవితంలో వారి ఇబ్బందులు చూసినవారు ఆ కష్టం నుంచి బయటపడితే బావుంటుందనుకున్నారు. కానీ వారిద్దరినీ వేరుచేయడం వైద్యరంగానికే ఛాలెంజ్‌గా మారింది. చివరికి అవిభక్త కవలలను వేరుచేయడంలో నిపుణులైన లండన్ వైద్యబృందం ఓ దశలో సర్జరీ సాధ్యమేనంది. అప్పట్లో శస్త్రచికిత్సకు అనుమతి కోరుతూ ఎయిమ్స్‌కి తెలంగాణ ప్రభుత్వం లేఖ కూడా రాసింది. నీలోఫర్ వైద్యులు కూడా ఈ ప్రక్రియని త్వరగా పూర్తిచేయాలని ఎయిమ్స్‌ని కోరారు. పన్నెండేళ్ల వయసులో సర్జరీకి లైన్‌క్లియర్ అవుతుందనే అనుకున్నారు. తమ సంరక్షణలో అన్నేళ్లపాటు ఉన్న పిల్లలు ఈ సమస్యనుంచి బయటపడాలని నీలోఫర్ వైద్య సిబ్బంది కోరుకున్నారు. శాశ్వత పరిష్కారం దొరికితే బావుంటుందని కోరుకున్నారు ఆ పిల్లల మంచీచెడ్డా చూసిన సంరక్షకులు కూడా. అవిభక్త కవలలు అనగానే ఎవరికైనా ఠక్కుమని వీణావాణినే గుర్తొస్తారు. తెలుగు రాష్ట్రాల్లో వీరి పేర్లు తెలియని వారు దాదాపుగా లేరు. అవిభక్త కవలల పట్టుదల ముందు వారి శారీరక ఆటంకం చిన్నబోయింది. అదే సమయంలో వైద్యరంగానికి కూడా అవిభక్త కవలల అంశం సవాలుగా మారింది. పేద కుటుంబం కావడంతో రెండేళ్ల పాటు గుంటూరు వైద్యుడు నాయుడమ్మ దగ్గర వీణావాణికి చికిత్స అందించారు. 2006లో హైదరాబాద్ నీలోఫర్ అసుపత్రికి తరలించారు. ఇద్దరిని వేరు చేసేందుకు ముంబై బ్రీచ్‌కాండీ ఆసుపత్రికి కూడా తీసుకెళ్లారు. మూడ్నెల్లపాటు అన్ని రకాల వైద్య పరీక్షలు చేసినా ఆపరేషన్‌కి రిస్క్ తీసుకోలేకపోయారు అక్కడి వైద్యులు. అమెరికా, ఆస్ట్రేలియా, కెనడా, లండన్ వంటి దేశాల వైద్యులు వచ్చి అన్ని వైద్య పరీక్షలు నిర్వహించినా శస్త్రచికిత్స మాత్రం సాధ్యంకాలేదు. ఏ సాంకేతిక సమస్యో అయితే తీర్చేయొచ్చు. డబ్బే సమస్యయితే సమకూర్చుకోవచ్చు. కానీ అది సున్నితమైన అంశం. భావోద్వేగాలతో ముడిపడ్డ అంశం. లండన్ వైద్యులు సవాలుగా తీసుకుని ప్రయత్నించినా వీణావాణిలను వేరు చేయాలన్న ప్రయత్నం అడుగుముందుకు పడలేదు. నీలోఫర్‌లో వీణావాణికి వైద్య పరీక్షలు జరిపిన గ్రేట్ ఆర్మండ్ స్ట్రీట్ ఆస్పత్రి వైద్యులు.. ఆపరేషన్ సక్సెస్ అయ్యే అవకాశం ఉందనటంతో ఆశలు చిగురించాయి. కానీ వందకు వందశాతం కాదు. ట్వంటీ పర్సెంట్ రిస్క్ ఉంది. ఆపరేషన్ 80 శాతం సక్సెస్ అయ్యే అవకాశం ఉందని తేల్చారు లండన్ వైద్యులు. కీడెంచి మేలెంచాలంటారు. రిస్క్ ఒకరికే జరగొచ్చు. లేదా ఇద్దరికీ జరగొచ్చు. అందుకే ఇలాంటి ఆపరేషన్లు రెండు విజయవంతంగా చేశామని లండన్ వైద్యులు చెప్పినా.. వీణావాణిల సర్జరీకి అనుమతులు లభించలేదు. పైగా ఆపరేషన్ ప్రక్రియ అంత సులువేం కాదు. ఐదు దశల్లో శస్త్రచికిత్స చేయాల్సి ఉంటుంది. ఆరు నుంచి 9 నెలల సమయం పడుతుంది. అన్నీ అనుకున్నట్లు జరిగితే ఆపరేషన్ సక్సెస్. తల్లిదండ్రులకు ఓకే. కానీ లండన్‌లో చికిత్స చేయాల్సి ఉండటం, రిస్క్ ఉందనటంతో ఆపరేషన్ ఆలోచన మరుగునపడింది మళ్లీ. ఆస్ట్రేలియా వైద్యులు కూడా ముందుకొచ్చినా.. ఆపరేషన్‌తో వీణవాణి ప్రాణాలకు హాని కలిగే ప్రమాదం ఉందని భావించింది ఎయిమ్స్. ఎలాంటి రిస్క్ లేదనడానికీ, కొంత ఉందనడానికి చాలా తేడా ఉంది. అందుకే రిస్క్ తక్కువే అయినా అవిభక్త కవలల శస్త్రచికిత్సకు ఎవరి మనసూ ఒప్పుకోలేదు. తలలు అతుక్కుని పుట్టారన్న ఒక్క సమస్య తప్ప.. ఆరోగ్యంగా ఉన్నారు వీణావాణి. ఒకవేళ విధి వక్రీకరించి జరగరానిది ఏమన్నా జరిగితేఆ నవ్వులు శాశ్వతంగా ఆగిపోతాయని భయం. అందుకే వాళ్ల జీవితాలను రిస్క్‌లో పెట్టడానికి ఎవరికీ మనస్కరించలేదు. శస్త్రచికిత్స జరగాలని ఎవరెవరో కోరుకోవడం కాదు.. తాము విడిపోవాలని వీణావాణి కోరుకోవడం లేదు. ఒకరి కష్టాన్ని మరొకరు ఇష్టంగా స్వీకరిస్తున్నారు. ఒకరు ఇబ్బందిపడ్డా మరొకరు సౌకర్యంగా ఉండేలా చూసుకుంటున్నారు. ఈ జన్మకిది చాలు అనుకుంటున్నారు. మా గురించి మీరెవరూ బెంగపెట్టుకోవద్దని తమ చిరునవ్వుతోనే చెబుతున్నారు. ఇరవై ఒక్క ఏళ్లు కలిసి బతికాం. మిగిలిన జీవితాన్ని కూడా ఇలాగే ఆనందంగా బతగ్గలం అన్నట్లే ఉన్నారు వీణావాణి. శారీరక సమస్య వారి పట్టుదలకు అడ్డురాలేదు. వారి చదువులకు ఆటంకం కలిగించలేదు. చార్టెడ్ ఎకౌంటెంట్లుగా తాము కోరుకున్న వృత్తిలో రాణించడం కూడా వారికి సమస్య కాబోదు. విధి వక్రీకరించిందనో, ఇలా ఎందుకు జరిగిందనో బాధపడుతూ కూర్చుంటే జీవితం ముందుకు సాగదు. పసిప్రాయంలోనే ఆశావహ దృక్పథంతో ప్రయాణం ప్రారంభించిన వీణవాణి.. తాము నిర్దేశించుకున్న గమ్యానికి చేరుకోవడం పెద్ద కష్టమేం కాదు.

# India's remaining diplomats 'clearly on notice' not to.: Canada foreign minister



Canada's foreign minister Mélanie Joly on Friday said the remaining Indian diplomats in Canada are "clearly on notice" not to endanger Canadian lives, as tensions between the two nations escalate over allegations of Indian involvement in the assassination of a Sikh separatist.The diplomatic standoff erupted earlier this week after Canada expelled India's high commissioner and five other diplomats, accusing them of being linked to a campaign of violence and intimidation against Sikh separatists in Canada."We've never seen that in our history. That level of transnational repression cannot happen on Canadian soil. We've seen it elsewhere in Europe. Russia has done that in Germany and the UK and we needed to stand firm on this issue," Joly said.What Canada foreign minister said on Indian diplomatsAsked if other Indian diplomats will be expelled, Joly said: "They are clearly on notice. Six of them have been expelled including the high commissioner in Ottawa. Others were mainly from Toronto and Vancouver and clearly we won't tolerate any diplomats that are in contravention of the Vienna convention."Joly's remarks come amid allegations by the Royal Canadian Mounted Police (RCMP) that Indian diplomats had allegedly been involved in actions leading to the killing of Hardeep Singh Nijjar, a Sikh separatist and a designated terrorist in India gunned down last year in British Columbia.The RCMP alleges that Indian diplomats operating in Canada have shared information about Sikh activists with Indian authorities, who have then passed it along to organized crime groups. These groups, according to Canadian officials, have been linked to extortion, drive-by shootings, and the assassination of pro-Khalistan activists, including Nijjar.India has vehemently denied the accusations, calling them "absurd" and retaliating by expelling six Canadian diplomats, including the acting high commissioner in New Delhi. The ministry of external affairs (MEA) spokesperson Randhir Jaiswal dismissed the claims and accused Canada of sheltering individuals wanted for terrorism-related charges in India."It is strange that the very people we've asked Canada to extradite are now being accused of crimes in Canada," Jaiswal said, pointing to 26 extradition requests India has filed, some pending for over a decade. He also suggested that Canada had not acted on provisional arrest requests for several individuals linked to terrorism.The diplomatic row has heightened tensions that were already strained following Prime Minister Justin Trudeau's statement in September 2023, when he suggested that Indian agents were potentially involved in Nijjar's murder. India had declared Nijjar a terrorist, and his killing outside a gurdwara in Surrey remains a flashpoint in the relationship.New Delhi has long accused Ottawa of turning a blind eye to the activities of Khalistani separatists. India claims that these activists operate freely in Canada, despite being implicated in terrorism-related cases in India.

# J&K Opposition slams Omar Abdullah for statehood-only resolution



Political parties in Jammu and Kashmir have criticised the Omar Abdullah-led Cabinet's resolution that sought the restoration of statehood but omitted any mention of Article 370. Various parties, including the People's Democratic Party (PDP), People's Conference (PC), and Awami Ittehad Party (AIP), labelled the move as a betrayal of the National Conference's (NC) pre-election promises to restore both statehood and Article 370.The Cabinet, chaired by Chief Minister Omar Abdullah, passed the resolution requesting statehood restoration, which was later sent to Lieutenant Governor Manoj Sinha for approval, news agency PTI reported.The decision sparked outrage amongst Opposition leaders, who reminded the NC of its manifesto commitment to challenge the Centre's 2019 decision that revoked Jammu and Kashmir's special status and downgraded it to a Union Territory. PDP leader Iltija Mufti criticised the resolution, calling it an "utter surrender" and accusing the NC of legitimising the Centre's disemp owerment of Jammu and Kashmir. PDP Youth President Waheed Para echoed this sentiment, stating that scaling back the demand to just statehood was a "huge setback" for the region.Baramulla MP Sheikh Abdul Rashid expressed disappointment, saying the resolution was a "departure" from the NC's principled stand. He questioned why Abdullah would request statehood when the BJP had already promised its restoration, suggesting that the omission of Article 370 showed the NC was playing into the BJP's hands.People's Conference chief Sajad Lone also expressed confusion over the secrecy surrounding the resolution and argued that such decisions should be debated in the Assembly, not just in the Cabinet. He urged the NC to fulfill its election promises and bring the matter of statehood and Article 370 to the Assembly for a proper vote.The resolution has stirred political tensions in the region, with parties continuing to demand the full restoration of Jammu and Kashmir's special status as per their pre-election commitments.

# Mahayuti finalises seat-sharing, BJP likely to contest on 156

New Delhi: The ruling Mahayuti alliance in Maharashtra appears to have reached a seat-sharing agreement for the upcoming assembly elections after Chief Minister Eknath Shinde and his two deputies Devendra Fadnavis and Ajit Pawar met Amit Shah in Delhi on Friday evening.The meeting of the top leaders of the gathered with BJP strategist Amit Shah as the seat-sharing discussions among the ruling parties reached a critical stage.The Bharatiya Janata Party (BJP), the Shinde-led Shiv Sena, and the Ajit Pawar-led Nationalist Congress Party (NCP) are aiming to retain power in the upcoming state Assembly elections on November 20.

Mahayuti alliance seat-sharing formula



Sources said after the meeting with Shah, the alliance has almost finalised the seat-sharing deal with the BJP getting the major chunk out of the total 288.The BJP will contest 156 seats while the Shinde's Sena has gotten 78 and Ajit Pawar's NCP faction will field candidates on 54 seats.According to sources, the BJP will allocate some of the seats from its quota to smaller parties, and in cases where a party lacks a strong candidate, there may be a plus-minus adjustment of up to five seats. Disputes regarding certain seats will be resolved at the state level following Amit Shah's directives.Further, a decision has been made to swap some seats between the BJP, NCP, and Shiv Sena, particularly where the sitting MLAs are facing anti-incumbency sentiment. A joint statement from the Mahayuti coalition regarding seat-sharing could be issued today. Amit Shah has urged all parties to immediately engage in campaigning for the polls.The assembly election in Maharashtra will be held in a single phase on November 20 and the counting of votes will take place on November 23.

# India's longest Vande Bharat train service covering a distance of 994 km will run from Delhi to..

For this year's Diwali and Chhath festivals, India will witness the launch of its longest-ever Vande Bharat Express, which will cover 994 kilometers in just 11.5 hours, running between Delhi and Patna.Specially introduced for the festive season, the train will feature chair car seating instead of sleeper berths and will operate over eight trips during the season. The service is set to begin on October 30 from Delhi. Until now, the longest Vande Bharat route was the New Delhi-Varanasi service, which spans 771 kilometers and has been operational since 2019.The first Vande Bharat Express, was kicked off on February 15, 2019, with a ceremonial launch by Prime Minister Narendra Modi on the New Delhi-Varanasi route.

Longest Vande Bharat Express Dates, timings and fare

The Vande Bharat Express will run between Delhi and Patna on November 1, 3, and 6, with return services from Patna to Delhi on October 31, and November 2, 4, and 7. Departing from Delhi at 8:25 am, it will reach Patna by 8 pm. From Patna, the train will depart at 7:30 am and arrive in Delhi at 7 pm. Key stops along the route include Kanpur Central, Prayagraj, Buxar, and Arrah.According to reports, the fare for the SC chair car on the Delhi-Patna Vande Bharat (train number 002252) will be Rs 2,575, while the AC executive chair car will cost Rs 4,655, with



meals and tea included in the fare.The Vande Bharat trains are intended to replace older Shatabdi train services, providing faster and more efficient travel options. With the addition of sleeper coaches in the near future, the service aims to enhance comfort for long-distance travellers.

రాయల్ జర్నలిజం
ద్విభాషా దినపత్రిక ROYAL JOURNALISM

రాయల్ స్పోర్ట్స్




రాయల్ సినిమా

# ఇలాగే కొనసాగితే ఆ మ్యాచ్‌లకు క్రేజ్ ఉండదన్న గంభీర్.. పాక్ సెలక్టర్



ఇటీవల కాలంలో పాకిస్థాన్ క్రికెట్ జట్టుకు ఘోర పరాభవాలు ఎదురైన సంగతి తెలిసిందే. బంగ్లాదేశ్‌తో టెస్టు సిరీస్‌ను కోల్పోవడంతో తీవ్ర విమర్శలు వచ్చాయి.ఇక ఇంగ్లండ్‌తో తొలి టెస్టులో మొదటి ఇన్నింగ్స్‌లో భారీ స్కోరు చేసినా ఓటమి తప్పలేదు. దీంతో రెండో టెస్టుకు జట్టులో భారీ మార్పులు చేసింది. స్టార్ ప్లేయర్లు బాబర్ అజామ్, షహీన్ అఫ్రిది లేకుండానే బరిలోకి దిగి.. అద్భుత విజయం సాధించింది. సెలక్షన్ కమిటీని కూడా పాక్ క్రికెట్ బోర్డు ప్రక్షాళన చేసింది. ఈ నేపథ్యంలో బాబర్, షహీన్‌ను పక్కన పెట్టినప్పుడు విమర్శలు చేసిన వారే.. ఇంగ్లండ్‌పై విజయం సాధించడంతో సెలక్టర్లపై ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. తాజాగా ఆ సెలక్షన్ కమిటీలోని సభ్యుడు, మాజీ పేసర్ అకిబ్ జావెద్ గతంలో భారత ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్‌తో సంభాషణను గుర్తు చేసుకున్నాడు. అద్భుతమైన క్రికెటర్లు ఉన్న పాక్ టీమ్ ఇలా కావడానికి కారణాలు ఏంటో అన్వేషించాలని సూచించినట్లు అకిబ్ వెల్లడించాడు."గతంలో శ్రీలంకతో సిరీస్ సందర్భంగా భారత ఆటగాళ్లను కలిసే అవకాశం వచ్చింది. అప్పుడే గంభీర్‌తో మాట్లాడా. 'అకిబ్ భాయ్, మీ క్రికెట్ జట్టుకు ఏమైంది? అద్భుతమైన ఆటగాళ్లు ఉన్నారు. ఎన్నోసార్లు నాణ్యమైన క్రికెట్ ఆడారు' అని నాతో అన్నాడు. ఆ మాటలు వినగానే ఒక్కసారిగా నాకు బాధేసింది. నిజమే కదా.. ఎంతో టాలెంట్ ఉన్న క్రికెటర్లు జట్టుకు ఆడుతున్నారు. అయినా మేం విజయం సాధించలేకపోతున్నామనిపించింది" అని అకిబ్ తెలిపాడు.

**దాయాదుల పోరుపై ప్రభావం**

"భారత్ – పాకిస్థాన్ మ్యాచ్ అంటే ప్రపంచవ్యాప్తంగా క్రికెట్ అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తారు. ఇరు జట్లూ విజయం కోసం చివరి వరకూ పోరాడతాయని అందరికీ తెలుసు. కానీ, ఇప్పుడు పాకిస్థాన్ పరిస్థితి ఇలా మారడంతో ఆ ఉత్కంఠ కోల్పోతుందనేది గంభీర్ భావించాడు. అందుకే, పాక్ క్రికెట్ పతనంకావడంపై భారత కోచ్ విచారం వ్యక్తం చేశాడు. ఉన్నత శ్రేణి జట్లు తలపడతేనే క్రికెట్ మజా ఉంటుంది" అని పాక్ సెలక్టర్ వెల్లడించాడు.

# అద్భుతమైన ఇన్నింగ్స్.. నీ కష్టానికి ప్రతిఫలం: సర్ఫరాజ్ సెంచరీపై సచిన్



బెంగళూరు వేదికగా భారత్–న్యూజిలాండ్ మధ్య తొలి టెస్టు జరుగుతోంది. నాలుగో రోజు టీమ్‌ఇండియా యువ క్రికెటర్ సర్ఫరాజ్ ఖాన్ సెంచరీ బాదేశాడు.క్లిష్టమైన రెండో ఇన్నింగ్స్‌లో సర్ఫరాజ్ ఖాన్ కేవలం 110 బంతుల్లోనే ఈ మార్క్‌ను అందుకున్నాడు. ఇది అతడి కెరీర్‌లో తొలి అంతర్జాతీయ సెంచరీ. అరంగేట్రం చేశాక నాలుగో టెస్టులోనే శతకం పూర్తి చేయడం విశేషం. ఈ నేపథ్యంలో క్రికెట్ దిగ్గజం సచిన్ తెందుల్కర్, ఆస్ట్రేలియా మాజీ స్టార్ ఆటగాడు డేవిడ్ వార్నర్, సర్ఫరాజ్ ఖాన్ సెంచరీపై ప్రశంసలు కురిపించారు. అతడిని అభినందిస్తూ సోషల్ మీడియా వేదికగా స్పందించారు.సర్ఫరాజ్ ఖాన్.. జట్టుకి అవసరమైనప్పుడు ఇలాంటి ఒక ఇన్నింగ్స్ ఆడి నీ కెరీర్‌లో తొలి సెంచరీ సాధించడం చాలా గొప్ప విషయం – సచిన్‌గొప్ప ప్రదర్శన చేస్తున్నావ్ సర్ఫరాజ్. నువు చేసిన హార్డ్ వర్క్ కనిపిస్తోంది. నాకు చాలా ఆనందంగా ఉంది– వార్నర్‌కాగా సోషల్ మీడియాలో పలువురు సర్ఫరాజ్ ఖాన్ సెంచరీపై స్పందిస్తున్నారు. 'సర్ఫరాజ్‌కు టైం వచ్చింది' అని ఒకరు పెట్టగా.. 'ఇలాంటి మూమెంట్ కోసమే అతడు ఎదురు చూస్తున్నాడు', 'అద్భుత ప్రదర్శన చేస్తున్నావ్' అంటూ పలువురు అతడిని ప్రశంసిస్తున్నారు. ఇదిలా ఉండగా, తొలి ఇన్నింగ్స్ లో పేలవ ప్రదర్శన చేసిన టీమ్‌ఇండియా 46 పరుగులకే ఆలౌటైన విషయం తెలిసిందే. ఆ మ్యాచ్‌లో సర్ఫరాజ్ సహా అయిదుగురు ఆటగాళ్లు డకౌట్ అయ్యారు. బ్యాటింగ్‌కి దిగిన కివీస్ తొలి ఇన్నింగ్స్‌లో 402 పరుగులు చేసింది.

**కివీస్‌పై సర్ఫరాజ్ సెంచరీ.. ఆ బ్యాటర్‌కు డేంజర్ బెల్!**

న్యూజిలాండ్‌తో జరుగుతున్న తొలి టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో భారత బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్ సెంచరీ చేశాడు.జట్టు కష్టాల్లో ఉన్న సమయంలో సెంచరీ సాధించడంతో అతడిపై ప్రశంసల వర్షం కురుస్తోంది. శుభ్‌మన్ గిల్ గైర్హాజరుతో విరాట్ కోహ్లీ వన్‌డౌన్‌లో బ్యాటింగ్‌కు వచ్చిన సంగతి తెలిసిందే. సర్ఫరాజ్ సెకండ్ డౌన్‌లో ఆడుతున్నాడు. సాధారణంగా అతడు మిడిలార్డర్‌లో బరిలోకి దిగే బ్యాటర్. గిల్ లేకపోవడంతో జట్టులోకి వచ్చిన సర్ఫరాజ్ తొలి ఇన్నింగ్స్‌లో డకౌట్‌గా పెవిలియన్‌కు చేరి నిరాశపరిచాడు. కానీ, రెండో ఇన్నింగ్స్‌లో మాత్రం చెలరేగిపోయాడు. దీంతో ఇప్పుడు ఒత్తిడంతా కేఎల్ రాహుల్‌పైనే ఉందని సోషల్ మీడియా వేదికగా క్రికెట్ అభిమానులు కామెంట్లు చేస్తున్నారు.

**శుభ్‌మన్ వస్తే..**

రెండో టెస్టు నాటికి శుభ్‌మన్ గిల్ వందశాతం ఫిట్‌నెస్ సాధిస్తే అతడికి అవకాశం దక్కడం ఖాయమే. అప్పుడు మిడిలార్డర్‌లో సర్ఫరాజ్ – కేఎల్ మధ్య తీవ్ర పోటీ ఉంటుంది. బంగ్లాదేశ్‌తో జరిగిన టెస్టు సిరీస్‌లో కేఎల్ నాణ్యమైన ఆటతీరే ప్రదర్శించాడు. కానీ, కివీస్‌తో తొలి టెస్టు మొదటి ఇన్నింగ్స్‌లో మాత్రం కేఎల్ కూడా డకౌటైన సంగతి తెలిసిందే. ఒకవేళ రెండో ఇన్నింగ్స్‌లో ఆడే అవకాశం వచ్చినప్పుడు భారీగా పరుగులు చేయాల్సి ఉంటుంది. లేకపోతే తదుపరి రెండు టెస్టుల్లోని తుది జట్టులో స్థానం దక్కడం కష్టమే అవుతుంది.

# నాని కోపం ఒక్క నిమిషమే!



మనిషికి అన్ని రకాల ఎమోషన్ కన్నా అత్యంత ప్రమాదరకమైన ఎమోషన్ కోపం. అది వచ్చిన కొంత మందిలో పగ ప్రతీకారాలతో రగిలి పోతుంటారు. మరికొంత మందిలో ఆ కోపం వెంటనే కరిగి పోతుంది. దీన్నే ముక్కు మీద కోపం..మూతి మీద కోపం అంటారు. మరి నేచురల్ స్టార్ నాని కోపం ఎలాంటింది అంటే? రెండో రకం అని తెలుస్తోంది. ఈ విషయాన్ని ఆయనే స్వయంగా రివీల్ చేసారు.నానికి కోపం వచ్చినా ఒక్క నిమిషం మాత్రమే ఉంటుంది. మరు నిమిషం ఆ కోపం కరిగి పోతుందిట. ఇలా కరిగి పోవడాన్ని తన బలహీనతగా చెప్పుకొచ్చాడు. ఎవరైనా హర్ట్ చేసినా ఆ క్షణం కోపం వచ్చినా? వెంటనే కొవ్వొత్తిలా కరిగిపోతుందన్నాడు. అంతేకానీ వాళ్లేదో అన్నారని...వాళ్ల మీద పగ పెంచుకోవడం..ప్రతీకారం తీర్చుకోవడం.. ఆ కోపాన్ని అలాగే కంటున్యూ చేయడం వంటివి ఉండవట.ఇలా కోపం చల్లారపోవడం అన్నది కొంత మందిలో గొప్ప లక్షణంగా చెప్పొచ్చు. పగలు..ప్రతీకారాలతో సాధించేది ఏమీ ఉండదు. అనవసరమైన వివాదాల్లో చిక్కుకోవడం తప్ప. నాని మనస్తత్వం అలాంటిందే. వెరీ కామ్ గోయింగ్ పర్సన్. ఎలాంటి వివాదాల్లో వేలు పెట్టడు. తన పని తాను చూసుకుని వెళ్లిపోతాడు. ఇతరుల విషయాల్లో వేలు పెట్టడు. జోవియల్ గా ఉంటాడు. నవ్వితే నవ్వుతాడు. పలకరిస్తే హాయ్ అంటాడు.ఇంతకు మించి ఎదుట వారు ఆశించేది ఏముంటుంది? అందుకే నేచురల్ స్టార్ గా నీరాజనాలు అందుకుంటున్నాడు. ప్రస్తుతం ఈ హీరో వరుస విజయాలతో దూసుకుపోతున్న సంగతి తెలిసిందే. ఇటీవలే 'సరిపోదా శనివారం'తో మరో సక్సెస్ ఖాతాలో వేసుకున్నాడు. శ్రీకాంత్ ఓదెలతో ఇటీవలే మరో చిత్రాన్ని పట్టాలెక్కించాడు. ఆ సినిమా షూటింగ్లోనే బిజీగా ఉన్నాడు.

# 'జై హనుమాన్' కోసం కాంతార..!



ఈ ఏడాది సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు వచ్చిన పలు సినిమాల్లో చిన్న సినిమా హనుమాన్ భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. టాలీవుడ్ చరిత్రలో సంక్రాంతికి మరే సినిమా సాధించని వసూళ్లు హనుమాన్ సినిమా సాధించడం జరిగింది. పాన్ ఇండియా రేంజ్‌లో హనుమాన్ కి మంచి స్పందన వచ్చింది. అందుకే దర్శకుడు ప్రశాంత్ వర్మ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని హనుమాన్ సీక్వెల్ 'జై హనుమాన్' ను రూపొందించే పనిలో ఉన్నాడు. జై హనుమాన్‌లోనూ తేజ సజ్జా ఉంటాడని ఇప్పటికే క్లారిటీ వచ్చింది. ఇక హనుమాన్ పాత్ర ను పోషించేది ఎవరు అనేది ప్రస్తుతం అందరి మనసులో ఉన్న ప్రశ్న.హనుమాన్ సినిమాలోనే ఆంజనేయుడి పాత్రను చూపించే అవకాశాలు ఉన్నాయని అంతా భావించారు. పాత్రను అయితే చూపించారు కానీ ఆ పాత్రను పోషించింది ఎవరు అనేది చూపించలేదు. గ్రాఫిక్స్ తో మేనేజ్ చేశారు. కానీ జై హనుమాన్‌లో మాత్రం కచ్చితంగా ఆంజనేయుడి పాత్రను ఎక్కువ పరిధిలో చూపించబోతున్నారు. అందుకే ఆ పాత్రను గ్రాఫిక్స్‌లో కాకుండా నటుడితో చేయించాల్సిన అవసరం ఉంది. అయితే ఆ పాత్రను ఎవరు చేస్తే బాగుంటుంది అనే చర్చలు జరుగుతున్నాయి. ఇలాంటి సమయంలో జై హనుమాన్ కోసం కన్నడ స్టార్, కాంతార హీరో రిషబ్ శెట్టిని ఈ సినిమా కోసం సంప్రదించారనే వార్తలు వస్తున్నాయి.ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో రూపొందబోతున్న జై హనుమాన్ సినిమాలో రిషబ్ శెట్టి నటించడం దాదాపుగా కన్ఫర్మ్ అయింది. కానీ హనుమంతుడి పాత్ర చేయబోతున్నాడా అనే విషయంలో మాత్రం క్లారిటీ రాలేదు. ఒక వేళ కాంతార స్టార్ రిషబ్ శెట్టి హనుమంతుడి పాత్ర పోషిస్తే కచ్చితంగా ప్రేక్షకులకు కన్నుల విందు ఖాయం అనే అభిప్రాయంను ఇండస్ట్రీ వర్గాల వారు వ్యక్తం చేస్తున్నారు. సోషల్ మీడియాలో ఇప్పటికే రిషబ్ శెట్టిని హనుమంతుడిగా గ్రాఫిక్స్ చేసి షేర్ చేస్తున్నారు. ఆ పోస్టర్స్ భలే ఉన్నాయి అంటూ కామెంట్స్ దక్కించుకుంటుంది.రిషబ్ శెట్టి ప్రస్తుతాం కాంతార చాప్టర్ 1 సినిమాను చేస్తున్న విషయం తెల్సిందే. చాలా బిజీగా ఉన్నా ప్రశాంత్ వర్మ వర్కింగ్ స్టైల్ తో పాటు జై హనుమాన్ సినిమాకు సంబంధించిన కథను చెప్పడం వల్ల రిషబ్ శెట్టి నో చెప్పలేక పోయాడట. పాత్ర తో పాటు ప్రతి పాత్ర చుట్టూ అల్లిన కథను రిషబ్ శెట్టి మెచ్చి నటించేందుకు ఓకే చెప్పాడని వార్తలు వస్తున్నాయి. జై హనుమాన్ లో రిషబ్ శెట్టి పాత్ర ఏది అయినా కన్నడ నాట ఈ సినిమాకు అత్యధిక ఆధరణ లభించే అవకాశాలు ఉన్నాయి. ప్రశాంత్ వర్మ యూనివర్స్ నుంచి బ్యాక్ టు బ్యాక్ ఇలాంటి క్రేజీ కాంబో మూవీస్ రాబోతున్నాయి. జై హనుమాన్‌లో మాత్రమే కాకుండా రిషబ్ శెట్టి మరిన్ని సినిమాలను ప్రశాంత్ వర్మతో కలిసి చేసే అవకాశాలు ఉన్నాయి.

# బాలీవుడ్ హీరోని మాస్ యాక్షన్ అవతార్‌లో చూపించిన టాలీవుడ్ డైరెక్టర్!



టాలీవుడ్ మాస్ డైరెక్టర్ గోపీచంద్ మలినేని హిందీ చిత్ర పరిశ్రమలో అడుగుపెడుతున్న సంగతి తెలిసిందే. బాలీవుడ్ సీనియర్ యాక్షన్ హీరో సన్నీ డియోల్‌తో కలిసి ఓ స్ట్రెయిట్ హిందీ సినిమాని తెరకెక్కిస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థలు మైత్రీ మూవీ మేకర్స్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఇప్పటి వరకూ #SDGM అనే వర్కింగ్ టైటిల్ తో పిలవబడుతున్న ఈ మూవీ ఫస్ట్ లుక్ అండ్ టైటిల్ పోస్టర్ ను మేకర్స్ తాజాగా రిలీజ్ చేసారు.సన్నీ డియోల్, గోపీచంద్ మలినేనిల చిత్రానికి "జాట్" అనే టైటిల్ ను ఫిక్స్ చేసారు. ఈరోజు (అక్టోబర్ 19) సన్నీ పుట్టినరోజు సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఫస్ట్ లుక్ ను చిత్ర నిర్మాతలు ఆవిష్కరించారు. "మాసివ్ యాక్షన్ కు నేషనల్ పర్మిట్ కలిగిన వ్యక్తిని పరిచయం చేస్తున్నాము. హ్యాపీ బర్త్‌డే యాక్షన్ సూపర్ స్టార్. మాస్ ఫీస్ట్ లోడింగ్" అని పేర్కొన్నారు. సన్నీని మాస్ యాక్షన్ అవతార్‌లో ప్రెజెంట్ చేసిన ఈ పోస్టర్ ఫ్యాన్స్ ను విశేషంగా ఆకట్టుకుంటోంది.'జాట్' ఫస్ట్ లుక్ లో సన్నీ డియోల్ ఓ పెద్ద ఫ్యాన్ ని పట్టుకొని సీరియస్ గా ఇంటెన్స్ గా చూస్తూ కనిపించారు. సెటప్ అంతా చూస్తుంటే ఇది ఓ భారీ యాక్షన్ సీక్వెన్స్ కి సంబంధించిందని అర్థమవుతోంది. అలానే టైటిల్ లోగో బోల్డ్ ఫాంట్‌తో ఆకట్టుకునేలా డిజైన్ చేయబడింది. దీనిపై రక్తపు మరకలు చూస్తుంటే.. ఇది భారీ యాక్షన్ మూవీగా రాబోతోందని తెలుస్తోంది. ఇక ఈరోజు సాయంత్రం ఈ మూవీ మోషన్ పోస్టర్ ను కూడా లాంచ్ చేయనున్నట్లు మేకర్స్ తెలిపారు.'క్రాక్' 'వీర సింహా రెడ్డి' వంటి సినిమాలతో మాస్ అంటే ఏంటో చూపించిన డైరెక్టర్ గోపీచంద్ మలినేని.. ఈసారి 'జాట్' మూవీతో నార్త్ ఆడియన్స్ కు తన మాస్ చూపించబోతున్నాడని ఫస్ట్ లుక్ చూస్తే అర్థమవుతోంది. సన్నీ డియోల్‌ను మునుపెన్నడూ చూడని మాస్, యాక్షన్ అవతార్‌లో చూపించడంలో సక్సెస్ అయ్యారు. 'గదర్ 2' సినిమాతో స్ట్రాంగ్ కంబ్యాక్ ఇచ్చిన సన్నీ నుంచి రాబోతున్న ఈ చిత్రంపై బాలీవుడ్ లో మంచి అంచనాలే ఉన్నాయి."జాట్" మూవీలో రణ్‌దీప్ హుడా, రెజీనా కసాండ్రా, సయామీ ఖేర్ తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ఎస్ థమన్ సంగీతం సమకూరుస్తున్నారు. రిషి పంజాబీ సినిమాటోగ్రఫీ.. నవీన్ నూలి ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అవినాష్ కొల్లా ప్రొడక్షన్ డిజైనింగ్ చేస్తున్నారు. నవీన్ యెర్నేని, వై రవి శంకర్, టీజీ విశ్వ ప్రసాద్ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. తెలుగు టీమ్ కలిసి హిందీలో చేస్తున్న ఈ సినిమాపై టాలీవుడ్ జనాల దృష్టి పడింది. ప్రస్తుతం ఈ మూవీ షూటింగ్ హైదరాబాద్ రామోజీ ఫిలిం సిటీలో జరుగుతోంది. వచ్చే ఏడాది ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు.

# సంక్రాంతి ఫైట్.. దిల్ రాజు ప్లాన్ ఎలా ఉందంటే..



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా శంకర్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న 'గేమ్ చేంజర్' రిలీజ్ సంక్రాంతికి కన్ఫర్మ్ అయ్యింది. ఈ సినిమాపై మెగా అభిమానులు చాలా హోప్స్ పెట్టుకున్నారు. అలాగే నిర్మాత దిల్ రాజుకి ఇది ఫస్ట్ పాన్ ఇండియా ప్రాజెక్ట్ కావడంతో చాలా నమ్మకంతో ఉన్నారు. డైరెక్టర్ శంకర్ కి కూడా కెరియర్ పరంగా ఈ మూవీ సక్సెస్ చాలా ముఖ్యం. ఇక రామ్ చరణ్ మార్కెట్ స్టామినా ఏంటనేది గేమ్ చేంజర్ తోనే తెలిసే ఛాన్స్ ఉంటుంది.ఇలా అందరికి 'గేమ్ చేంజర్' మూవీ విజయం చాలా అవసరం అని చెప్పాలి. అయితే ఈ సినిమాపై చెప్పుకోదగ్గ బజ్ ఇప్పటి వరకు లేదు. రెండు సాంగ్స్ రిలీజ్ అయిన ప్రేక్షకులని పూర్తిగా మెప్పించలేదు. దీపావళికి 'గేమ్ చేంజర్' టీజర్ ని రిరిలీజ్ చేయబోతున్నారు. ఈ టీజర్ తో మూవీకి ఊపొస్తుందని భావిస్తున్నారు. శంకర్ ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ పై చాలా శ్రద్ధ పెట్టారు. ఇదిలా ఉంటే దిల్ రాజు ఈ సినిమాని సంక్రాంతికి పెర్ఫెక్ట్ గా ప్లాన్ చేస్తున్నారు.తెలుగు రాష్ట్రాలలో 50 శాతం థియేటర్స్ లలో 'గేమ్ చేంజర్' మూవీని రిలీజ్ చేయనున్నారంట. అలాగే భారీ ఎత్తున బెన్ ఫిట్ షోలు ప్లాన్ చేస్తున్నారని తెలుస్తోంది. మిడ్ నైట్ షోలతో పాటు ఎర్లీ మార్నింగ్ షోలు కూడా వీలైనన్ని ఎక్కువ థియేటర్స్ లో వేయనున్నారని టాక్. టికెట్ ధరలు కూడా పెంచుకోవడానికి రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు ఎలాగూ పర్మిషన్ ఇస్తాయి. సంక్రాంతి ఫెస్టివల్ సందర్భంగా ఆడియన్స్ ఫస్ట్ ఛాయస్ కూడా 'గేమ్ చేంజర్' ఉండే ఛాన్స్ ఉంది. అందుకే మెజారిటీ థియేటర్స్ లలో ఈ చిత్రాన్ని వేయనున్నారంట.మిగిలిన 50 శాతం థియేటర్స్ లలో ఇతర సినిమాలు ప్రదర్శిస్తారని తెలుస్తోంది. జనవరి 10న ఈ సినిమా రిలీజ్ కాబోతోంది. తరువాత శని, ఆదివారాలు వస్తున్నాయి. జనవరి 13, 14, 15 తేదీలలో భోగి, సంక్రాంతి, కనుమ ఉన్నాయి. ఈ మూడు రోజులు ప్రేక్షకులు సినిమాలు చూడటానికి విపరీతంగా ఆసక్తి చూపిస్తారు. మొత్తం సంక్రాంతి ఫెస్టివల్, వీకెండ్ కలిపి 6 రోజులు 'గేమ్ చేంజర్' కి అదిరిపోయే కలెక్షన్స్ రావడం గ్యారెంటీ అని మేకర్స్ భావిస్తున్నారు.కరెక్ట్ గా పబ్లిసిటీ చేసి, సినిమాని వీలైనంత స్ట్రాంగ్ గా జనాల్లోకి తీసుకొని వెళ్తే భారీ కలెక్షన్స్ కొల్లగొట్టడం గ్యారెంటీ అని అంచనా వేస్తున్నారు. అన్ని అనుకున్నట్లు జరిగితే, మూవీకి పాజిటివ్ టాక్ వస్తే కచ్చితంగా కలెక్షన్స్ ఊచకోత ఖాయం అని ట్రేడ్ పండితులు కూడా భావిస్తున్నారు.

# లోకేష్ కనగరాజ్.. నెక్స్ట్ ఆ కోలీవుడ్ యంగ్ హీరోతో!

ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీలో కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ లోకేష్ కనగరాజ్ కు ఎలాంటి క్రేజ్ ఉందో అందరికీ తెలిసిందే. ఇప్పటి వరకు తీసినవి తక్కువ సినిమాలే అయినా.. తనదైన మార్క్ ను క్రియేట్ చేసుకున్నారు. ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. లోకేష్ డెన్ నుంచి మూవీ వస్తుందంటే చాలు.. సూపర్ హిట్ అవుతుందని అంతా ఫిక్స్ అయిపోతున్నారు. అంతలా సినీ ప్రియుల నమ్మకాన్ని గెలుచుకున్నారు.లోకేష్ కనగరాజ్ ఇప్పటికే ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చిన ఖైదీ, మాస్టర్, విక్రమ్ మూవీస్ అయితే వేరే లెవెల్ అని చెప్పాలి. వాటితో ఒక సిగ్నేచర్ మార్క్ ను సొంతం చేసుకున్నారు. అదే సమయంలో లోకేష్ సినిమాటిక్ యూనివర్స్ పై ప్రేక్షకుల్లో హోప్స్ పెంచారు. అందులో నుంచి ఫ్యూచర్ లో మరిన్ని సినిమాలు రానున్నట్లు తెలిపారు. విక్రమ్ 2, రోలెక్స్, ఖైదీ 2, లియో 2 ప్రాజెక్టులతో త్వరలో ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. ఇప్పుడు రజినీకాంత్ తో కూలీ మూవీ చేస్తున్నారు.ప్రస్తుతం కూలీ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతున్న విషయం తెలిసిందే. గోల్డ్ అక్రమ రవాణా నేపథ్యంతో తెరకెక్కుతున్న ఆ మూవీ కోసం అన్ని ఇండస్ట్రీల నుంచి క్యాస్టింగ్ ను తీసుకొచ్చారు లోకేష్. టాలీవుడ్ కింగ్ అక్కినేని నాగార్జున నెగిటివ్ షేడ్స్ ఉన్న రోల్ లో నటిస్తున్నారు. మహేంద్రన్, మంజుమ్మెల్ బాయ్స్ ఫేం సౌబిన్ షాహిర్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. అయితే సోషల్ మీడియాలో ఇప్పుడు లోకేష్ కనగరాజ్ లైనప్ కోసం జోరుగా చర్చ సాగుతోంది.ఇప్పటికే అదిరిపోయే లైనప్ ను సెట్ చేసుకున్న లోకేష్ కనగరాజ్.. త్వరలో యంగ్ హీరో శివ కార్తికేయన్ తో ఓ సినిమా చేయనున్నారని ఇప్పుడు వార్తలు వస్తున్నాయి. ఇప్పటికే ఆ మూవీ కోసం లోకేష్ స్క్రిప్ట్ రెడీ చేసుకున్నట్లు తెలుస్తోంది. కొద్ది రోజుల క్రితం.. శివ కార్తికేయన్ కు లోకేష్ స్టోరీ నెరేట్ చేశారని సమాచారం. వెంటనే యంగ్ హీరో గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని వినికిడి. దీంతో మరికొద్ది రోజుల్లో లోకేష్, శివ కార్తికేయన్ కాంబోలో సినిమా స్టార్ట్ అవ్వనుందని టాక్ వినిపిస్తోంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY CHALLA SRIKANTH, PRINTED AT SRINIVASA PRINTERS D.NO 7-4-5, NEAR RAMALAYAM TEMPLE, BAPATLA WEST,(U) VILLAGE, BAPATLA -522101, GUNTUR DISTRICT, ANDHRA PRADESH, PUBLISHED AT D.NO 7-4-5, NEAR RAMALAYAM TEMPLE, BAPATLA -522101 GUNTUR DISTRICT, ANDHRA PRADESH,
EDITOR : CHALLA SRIKANTH, RNI : APBIL / 2023 / 86665, CELL: 6281086394 , emil srikanth9550389070@gmail.com